

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం

11 ఫిబ్రవరి 2026 పేజీలు : 08


అటవీ శాఖ విభాగాల్లో తనదైన కీలక భాగస్వామ్య పాత్ర పోషి స్తూ విశేష ప్రాముఖ్యతను సంతరించుకున్న సామాజిక వన విభాగం (సోషల్ ఫారెస్ట్) అభివృద్ధి, సాధికారతలపై ప్రభు త్వాల దృష్టి రోజురోజుకి సన్న గిల్లుతున్న నేపథ్యంలో అధి కారులు, సిబ్బంది ఆర్థిక సంక్షో భంతో కొట్టుమిట్టాడాల్సిన పరిస్థితి నెలకొంది. నేటి సమాజ ఆవశ్యకతలో మానవ మనుగడకు తీవ్ర అవరోధంగా మారిన పర్యా వరణ కాలుష్యాన్ని సమూలంగా నిర్మూలించి సమతుల్యతతో ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పేందుకు అవసరమైన మొక్కల పెంపకం నిమిత్తం ముందుచూపుతో ఆలోచించిన ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని అటవీ సామాజిక వన విభాగాన్ని అందుబాటులోకి తీసుకురావడం జరిగింది.



## అయ్యో పాపం..
# సోషల్ ఫారెస్ట్?

- నిధుల కేటాయింపుల్లో దక్కని ప్రాధాన్యత
- వెంటాడుతున్న ఆర్థిక ఇబ్బందులు, సిబ్బంది కొరత
- భర్తీకి నోచుకోని ఉద్యోగ ఖాళీలు
- డీఆర్ఓలకే ఇన్‌చార్జ్ రేంజ్ ఆఫీసర్లుగా అదనపు బాధ్యతలు
- నత్తనడకన ప్రభుత్వ లక్ష్యాల సాధన
- మనుగడ కోల్పోతున్న సోషల్ ఫారెస్ట్
- దాదాపు కనుమరుగయ్యే పరిస్థితులు
- నిస్సహాయ స్థితిలో అధికారులు, సిబ్బంది ఆందోళన
- ప్రభుత్వం ఆదుకునేనా? పూర్వ వైభవం తిరిగి వచ్చేనా?
- ప్రశ్నార్థకంగా మారిన సోషల్ ఫారెస్ట్ భవితవ్యం

నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :

ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రమైన నెల్లూరు నగరం లోని పొదలకూరు రోడ్డు ప్రాంతంలో ఉన్న వాటర్ ట్యాంక్ వద్ద సోషల్ ఫారెస్ట్ డివిజనల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంతో పాటు నెల్లూరు, ఆత్మకూరు, కావలి, నాయుడుపేట (ప్రస్తుత తిరుపతి జిల్లా) ప్రాంతాల్లో రేంజ్ కార్యాలయాలను నెలకొల్పి అనుసంధానం చేయడం జరిగింది. ఆయా రేంజ్‌ల పరిధిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దాదాపు 11 నర్సరీల ద్వారా ప్రతి ఏటా ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాల ప్రకారం మొక్కల పెంపకం చేపట్టడంతోపాటు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ ఖాళీ స్థలాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, స్వచ్ఛంద సంస్థలు, దేవాలయాల ఆవరణలోను, రహదారి మార్గాలకు ఇరువైపులా నాటి, సంరక్షణతో పెంచి పోషించేందుకు అవసర మైన నానా జాతి రకాలకు చెందిన నర్సరీ మొక్కలను ఉచితంగా పంపిణీ చేయడం జరిగేది. ఈ క్రమంలో ప్రభుత్వం అప్పగించిన నర్సరీ మొక్కల పెంపకం లక్ష్యాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్న పట్టుదలతో ముందడుగు వేసిన పలువురు సోషల్ ఫారెస్ట్ జిల్లాస్థాయి అధికారుల దిశ.. నిర్దేశిత మార్గదర్శకాల సారథ్యంలో ఆయా రేంజ్‌లకు చెందిన క్షేత్రస్థాయి అధికారుల పర్యవేక్షణ, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ల చొరవ, సెక్షన్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ స్థాయి ఉద్యోగుల పరస్పర పోటీతత్వంతో కూడిన

-మిగతా 2లో

## మేధో సంపత్తి హక్కులపై ఏఐ ప్రభావంపై తీసుకున్న
# చర్యలేంటి ?
### లోక్‌సభలో ఎంపీ వేమిరెడ్డి ప్రశ్న

నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :



దేశంలో ఆర్టిఫీషియల్ ఇంటె లిజెన్స్ (ఏఐ) వినియోగం పెరిగిన నేప థ్యంలో మేధో సంపత్తి హక్కులపై (ఇంటె క్చుల్ ప్రాపర్టీ రైట్స్) దాని ప్రభావం అంచ నాకు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వివరించాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. మంగళ వారం ఈ అంశంపై పలు ప్రశ్నలు వేశారు. ప్రభావాన్ని అంచనా వేయడానికి నిర్వ హించిన సమీక్షలు, ప్రభుత్వ

-మిగతా 2లో



02

## 12న జిల్లాలో వైఎస్ షర్మిల రెడ్డి పర్యటన



02 పేజీలో

## రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి

## ప్రజా ఆరోగ్యమే..
# ప్రభుత్వ లక్ష్యం

- మాది మాటల ప్రభుత్వం కాదు ఇది చేతల ప్రభుత్వం
- అభివృద్ధి అంటే శంకుస్థాపనలు చేసి వదిలేయడం కాదు
- ప్రజాధనం దుర్వినియోగం కాకూడదనే.. గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా వదిలేసిన నిర్మాణాలు పూర్తి చేస్తున్నాం
- హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



అభివృద్ధి అంటే శంకుస్థాపనలు చేయడం ఒక్కటే కాదని, తలపెట్టిన పనిని పూర్తి చేసి ప్రజలకు అంకితం చేయడమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు.

వివరాలు 2లో

## రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు
# ఏర్పాటు చేయండి



- కలెక్టర్‌కు విన్నవించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి
- సివిల్ సప్లయ్ అధికారులు రైతులకు సకాలంలో గోనె సంచులు అందచేసేలా ఆదేశించండి
- ధాన్య సేకరణకు సంబంధించి పౌర సరఫరా శాఖ సహకార సంఘాలకు చెల్లించాల్సిన బకాయిలు త్వరగా చెల్లించేలా చొరవ చూపండి

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** కోవూరు నియోజకవర్గ పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో చర్చించారు. ధాన్య సేకరణ సందర్భంగా రైతులు ఎదు ర్కొంటున్న పలు సమస్యలను ఆమె.. కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ మేరకు ఆమె జిల్లా కలెక్టర్‌కు వినతి సమర్పించారు. ధాన్య సేకరణ సందర్భంగా నియమించే టెక్నికల్ అసి స్టెంట్ల స్థానంలో రైతుల సమస్యలపై అవగాహన వున్న విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్లను నియమిం చాలని కోరారు. ధాన్య సేకరణలో కీలక పాత్ర పోషించే సహకార సంఘాలకు పౌర సరఫరాల శాఖ నుంచి రావాల్సిన కమీషన్ 2021 వ సంవ త్సరం నుంచి పెండింగ్ లో ఉందని సకాలంలో చెల్లించేలా చొరవ తీసుకోవాలని కోరారు. సివిల్ సప్లై వారు కమీషన్ చెల్లించని కారణంగా సహ కార సంఘాల నిర్వహణ భారంగా మారిందని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కలెక్టర్‌కు తెలిపారు. సివిల్ సప్లయ్ అధికారులు రైతులకు సకాలంలో ఖాళీ గోనె సంచులు అందచేసేలా ఆదేశించాల న్నారు. ధాన్యం రవాణా పరంగా రైతులు ఎదు ర్కొంటున్న ఇబ్బందులను ఆమె కలెక్టర్ దృష్టికి తెచ్చారు. రబీ సీజన్ ధాన్యం కొనుగోలకు సంబం ధించి ఏర్పాట్ల కోసం నెల ముందుగానే సహకార సంఘాలకు అడ్వాన్స్ కమీషన్ చెల్లించాలని కోరారు. దీంతో పాటు నియోజకవర్గంలో జరుగు తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు త్వరితగతిని పూర్తయ్యేలా సహకరించాలన్నారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అభ్యర్థనతో వెంటనే స్పం దించిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా కోవూరు నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాథమిక సహకార సంఘాలకు చెల్లించాల్సిన 6 కోట్ల 89 లక్షల 98 వేల 544 రూపాయల పాత బకాయి లను త్వరగా చెలియించేలా చర్యలు తీసుకోవా లని జాయింట్ కలెక్టర్‌ను ఆదేశించారు. సివిల్ సప్లై అధికారులతో సమన్వయం చేసుకొని ఖాళీ గోనె సంచులు, ధాన్యం రవాణా తదితర సమ స్యలను పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డితోపాటు జిల్లా కలెక్టర్‌ని కలిసిన వారిలో మండల వ్యవసాయ అధికారిణి అనిత, పెన్నాడెల్టా ఛైర్మెన్ జెట్టి రాజగోపాలరెడ్డి, రాష్ట్ర ఎంఎస్ఎంఇ డైరెక్టర్ రావెళ్ల వీరేంద్రనాయుడు, జొన్నవాడ ఆలయ ఛైర్మెన్ తిరుమూరు అశోక్ రెడ్డి, సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి, ఇంతా మల్లారెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, ఇంతా మల్లారెడ్డి, కెవి శేషయ్య పాల్గొన్నారు.

## ప్రజా ఆరోగ్యమే.. ప్రభుత్వ లక్ష్యం

**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** అభివృద్ధి అంటే శంకుస్థాపనలు చేయడం ఒక్కటే కాదని, తలపెట్టిన పనిని పూర్తి చేసి ప్రజలకు అంకితం చేయడమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణం 1వ వార్డులోని కట్టుబడి పాళెంలో ఆమె 1 కోటి 16 లక్షలు వెచ్చించి నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. ప్రజారోగ్యమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. గతంలో వైద్య సేవలు అందుబాటులో లేక కట్టుబడి పాళెంవాసులు దగ్గర్లో ఉన్న బుచ్చికో.. నెల్లూరుకో పోవాల్సి వచ్చేదని, ఇక్కడే అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభించాక ఆ అవసరం తప్పిందన్నారు. గత ప్రభుత్వం 5 సంవత్సరాల క్రితం శంకుస్థాపన చేసిన అర్బన్ హెల్త్ సెంటర్ తన హయాంలో పూర్తి కావడం సంతోషంగా ఉంద న్నారు. చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అసంపూర్తిగా వదిలేసిన చాలా భవనాల నిర్మాణాలు పూర్తి చేసి ప్రజా వినియోగంలోకి తెచ్చామన్నారు. ప్రజావసరాలను గుర్తించి ప్రజాధనం సద్వినియోగం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందనన్నా రు. ఇకపై అత్యవసర ప్రాథమిక చికిత్స కోసం పట్టణాలకు పరుగులు తీయాల్సిన అవసరం లేదని ప్రజావసరాల కోసం నిర్మించిన ఈ అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించా రు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లే స్తోమత లేని నిరుపేదలే ప్రభుత్వ ఆసుపత్రు లకు వస్తుంటారని, వారి పట్ల సానుభూతి చూపాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి వైద్య సిబ్బందికి సూచించారు. 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని డాక్టర్లను కోరారు. త్వరలోనే ఈ అర్బన్ హెల్త్ సెంటర్‌కు కావాల్సిన వైద్య పరికరాలు సమకూరుస్తానని తెలిపారు. మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం వైద్యం కోసం ఖర్చు పెట్టే కోట్లాది రూపాయలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందేలా చూడాల్సిన బాధ్యత డాక్టర్లపై ఉందని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు.

కార్యక్రమంలో జిల్లా ఆరోగ్యశాఖాధికారి సుజాత, బుచ్చిరెడ్డిపాళెం మున్సిపల్ కమీషనర్ బాలకృష్ణ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, స్థానిక కౌన్సిలర్ కత్తి నాగరాజు, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు ఎంవి శేషయ్య, టిడిపి పట్టణ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసరావు, టిడిపి గౌరవ అధ్యక్షులు టంగుటూరి మల్లారెడ్డి, మాజీ జొన్నవాడ ఆలయ ఛైర్మెన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు, టిడిపి నాయకులు నెల్లూరు ప్రభాకర్ రెడ్డి, నందకుమార్, బుచ్చి పట్టణ వైస్ ఛైర్మెన్లు, కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## అయ్యో పాపం.. సోషల్ ఫారెస్ట్ !

(మొదటి పేజీ తరువాయి)

కృషి ఫలితంగా వంద శాతం సత్‌సంకల్ప లక్ష్యాల సాధనకు కృషి చేయడంతోపాటు శాఖాపరమైన పురోగాభివృద్ధి ప్రస్థానాన్ని ప్రగతి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లడం జరిగింది. దీంతో సోషల్ ఫారెస్ట్ విభాగం అధికారుల పనితీరుపై సంతృప్తి చెందిన ప్రభుత్వాలు సైతం వివిధ రకాల పథకాల ద్వారా విరివిగా నిధులు మంజూరు చేస్తూ నర్సరీల అభివృ ద్ధితోపాటు మొక్కల పెంపకాన్ని మరింత వేగవంతం చేసేందుకు అవసర మైన తోడ్పాటు అందించడం జరిగింది. దీంతో ఎలాంటి ఢోకా లేకుండా దినదినాభివృద్ధితో ముందుకు సాగుతున్న సామాజిక మన విభాగం ప్రస్థానం ప్రగతి పథంలో పయనిస్తూ ప్రజలకు మరింత చేరువైంది. అయితే కాలం గడుస్తున్న కొద్దీ సామాజిక మన విభాగం ప్రాముఖ్యతపై ప్రభుత్వాల దృష్టి సన్నగిల్లడంతో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నోచుకోకపోవడం, ఇదే సమ యంలో పలువురు అధికారులు సిబ్బందికి తమ పదవీ కాలపరిమితి పూర్తి కావడంతో ఉద్యోగ విరమణ చేయడం, పదోన్నతుల ప్రక్రియ ఊసే లేకపో వడం, కొత్తగా ఉద్యోగుల నియామకాలు చేపట్టకపోవడం, పలు రేంజ్ కార్యాలయాలకు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లనే ఇన్‌ఛార్జ్ క్షేత్రస్థాయి అధికారులు గా నియమిస్తూ అదనపు బాధ్యతలు అప్పగించడం వంటి నిర్ణయాలతో పాలనాపరమైన సౌలభ్యాన్ని కోల్పోవడం వంటి కారణాల వల్ల శాఖపరమైన అభివృద్ధి, నిర్వాహణ, మొక్కల పెంపకం లక్ష్యాల సాధన పరమైన అడుగులు ముందుకు పడకపోతుండటంతో భవిష్యత్ కార్యాచరణ అమలు ప్రక్రియ మందగించి డోలాయమానంలో పడినట్లు తెలుస్తుంది. ప్రతి ఐదేళ్లకు ఒకసారి ప్రభుత్వాలు మారుతుండటం, కొత్త ప్రభుత్వాలు అధికారంలోకి వస్తున్నప్పటికీ సోషల్ ఫారెస్ట్ స్థితిగతులను గురించి పట్టించుకున్న దాఖలాలు మచ్చుకైన లేకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడేనన్న చందంగా మారిందనే చర్చలు ఉద్యోగుల మధ్య జోరుగా సాగుతున్నాయి. గత పది ఏళ్ల నుంచి మరింత నిర్లక్ష్యానికి గురైన సోషల్ ఫారెస్ట్ ప్రస్థానానికి క్రమక్రమేనా ఆదరణ కొరవడినట్లు తెలుస్తుంది. దీనికి తోడు అటవీ టెరిటోరియల్ విభాగానికి అనేక రకాల పథకాల ద్వారా విరివిగా నిధులు మంజూరు చేస్తున్న ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు అవసరమైన మొక్క లు పెంచి అందించడంలో ప్రాముఖ్యతను సంతరించుకున్న సామాజిక వనవిభాగానికి టెరిటోరియల్‌కు మంజూరు చేస్తున్న నిధులలో కనీసం 4వ వంతు కూడా కేటాయింపుతో ప్రాధాన్యత కల్పించిన దాఖలాలు లేకపోవ డంతో కొరవడిన అభివృద్ధి, నర్సరీ మొక్కలు పెంపకంలో వెనుక బడటం, అధికారులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న నిర్వహణ భారం వెరసి సోషల్ ఫారెస్ట్ ప్రస్థానం దాదాపుగా కనుమరుగయ్యే పరిస్థితులకు దారితీస్తుండడంతో ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూడడం సంబంధిత అధికారులు సిబ్బంది వంతవుతుంది.

ఇలాంటి గడ్డు పరిస్థితుల నుంచి సోషల్ ఫారెస్ట్‌ను గట్టెక్కించేందుకు ప్రభుత్వాలు ఆదుకునేనా, పూర్వ వైభవం మరలా వచ్చేనా, అన్న సందేహాలు అటు ఉద్యోగులు, ప్రజల నుంచి సర్వత్ర వ్యక్తమవు తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వాలు చొరవ చూపి ప్రశ్నార్థ కంగా మారిన సోషల్ ఫారెస్ట్ భవితవ్యాన్ని కాపాడటంతోపాటు అభివృద్ధి, నర్సరీ మొక్కల పెంపకంతో ఆరోగ్యకర సమాజాభివృద్ధికి పెద్దపీట వేసే దిశగా తీసుకో వాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు, పరిశీలకులు, జిల్లా ప్రజానీకం కోరుతున్నారు. మరి ప్రభుత్వం ఏమేరకు చొరవతో సోషల్ ఫారెస్ట్ అభివృద్ధిపై చర్యలు తీసుకుంటుందో వేసి చూడాల్సిందే.

## 12న జిల్లాలో వైఎస్ షర్మిల రెడ్డి పర్యటన



**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :** ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో భాగంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురా లు వైయస్ షర్మిలారెడ్డి నెల 12న నెల్లూరు జిల్లాలో పర్యటిస్తున్నట్లు డిసిసి అధ్యక్షులు నారపరెడ్డి కిరణ్ కుమార్‌రెడ్డి తెలిపారు. నెల్లూరు నగరంలోని ఇందిరా భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సర్వే పల్లి నియోజకవర్గం పరిధి లోని మనుబోలు మండలం అక్కంపేట గ్రామంలో ఉపాధి హామీ పరిరక్షణ సభలో షర్మిల రెడ్డి పాల్గొనున్నారని, అనంతరం కావలిలో జరిగే రచ్చబండ కార్యక్రమంలో కూడా ఆమె పాల్గొంటారని వివరించారు. అదేవిధంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్రం నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, మౌలిక వసతులు అనేక అభివృద్ధి పనులు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్నా యన్నారు. అంతేకాకుండా గ్రామాల్లో వలసలు లేకుండా అడిగిన వారందరికీ పని కల్పించడమే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లక్ష్యమన్నారు. ఇటువంటి చట్టాన్ని నిర్వీర్యం చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వాలు, పాలకులు నోరు మెదపటం లేదని ఈ సందర్భంగా తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వెంకటరావు యాదవ్, ఇంచార్జ్ గోపాల్ రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షులు ఇర్ఫాన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ యశోదర, ఉపాధ్యక్షుడు బాల సుధాకర్, ప్రధాన కార్యదర్శి పంట శ్రీనివాసరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, లీగల్ సెల్ చైర్మన్ అడ్వకేట్ సుధీర్, నరసింహం, అల్లావుద్దీన్, మల్లికార్జున్ రెడ్డి,హాజీ హనీఫ్, బద్రి తదితరులు పాల్గొన్నారు.




## మేథో సంపత్తి హక్కులపై ఏఐ ప్రభావంపై తీసుకున్న చర్యలేంటి ?

(మొదటి పేజీ తరువాయి)

అధ్యయనాలు, క్రియేటర్స్, ఆవిష్కర్తలు, రైట్ హోల్డర్స్ వంటి వారు ఎదుర్కొంటున్న నష్టాలపై ఆరా తీశారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని మేథో సంపత్తి హక్కుల చట్టానికి ఏవైనా సవరణలు, సంస్కరణల ప్రతిపాదనలపై వివరాలు కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశ్నలకు కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద సమాధానమి చ్చారు. దేశంలో గత ఐదేళ్లుగా మేధో సంపత్తి హక్కులపై (ఇంటెక్చల్ ప్రాపర్టీ రైట్స్) కృత్రిమ మేధ ప్రభావాన్ని అంచనా వేయడానికి ప్రభుత్వం ఎలాంటి సర్వేలు చేపట్టలేదన్నారు. ఏఐ -జనరేటెడ్, ఏఐ -సహాయక కంటెంట్ సాంకేతికతల కారణంగా ఆవిష్కర్తలు, హక్కుదారులు ఎదు ర్కొంటున్న నష్టాలపై వివరాలు లేవన్నారు. అయితే ఏఐకు సంబంధించి న ఉద్భవిస్తున్న సమస్యలు, కాపీరైట్ చట్టంపై దాని ప్రభావాలను అధ్యయనం చేయడానికి డీపీఐఐటీ (డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రొమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్) గత ఏడాది ఏప్రిల్ 28న ఎనిమిది మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. ఏఐ శిక్షణలో కాపీరై ట్ చేయబడిన కంటెంట్ వాడకంపై కమిటీ ఒక వర్కింగ్ పేపర్‌ను ఖరా రు చేసి వాటాదారుల అభిప్రాయం కోసం ప్రచురించబడిందన్నారు. అందులో భాగంగా కాపీరైట్ సందర్భంలో కృత్రిమ మేధస్సు వాడకం వల్ల ఉత్పన్నమయ్యే చట్టపరమైన, విధానపరమైన సమస్యలను గుర్తిం చడం, విశ్లేషించడం, సమస్యలను పరిష్కరించడంలో కాపీరైట్ చట్టం, 1957 యొక్క ప్రస్తుత నిబంధనల సమర్థతను పరిశీలించడం, సిఫార్సు లు చేయడం, విశ్లేషణ ఆధారంగా ఒక వర్కింగ్ పేపర్‌ను తయారు చేసి డిపార్ట్‌మెంట్ ప్రచురిస్తుందని వివరించారు.

# బీజేపీ నాయకులకు సముచిత స్థానం కల్పించాలి

- కూటమిపాలనలో ఆగని బియ్యం గ్రావెల్ మాఫియా
- అవినీతిని ప్రోత్సహిస్తున్న అధికారులు
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుండ్లపల్లి భరత్ కుమార్ యాదవ్




**జలదంకి, మేజర్‌న్యూస్ :** జిల్లాలోని కొంతమంది ఎమ్మెల్యేలు, ఎంపీలు బిజెపి నాయకులను కార్యకర్తలను పట్టించుకోవడంలేదని, పరిస్థితి ఇలాగే కొనసాగితే మాట్లాడాల్సి వస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుండ్లపల్లి భరత్ కుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం జలదంకి లోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బిజెపి అధ్యక్షులు పివిఎన్ మాధవ్ లు రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు పనిచేస్తున్నారన్నారు. జిల్లాలో ఇందుకు భిన్నంగా ఇసుక రేషన్ మాఫియా దందా ఇంకా కొనసాగుతూనే ఉందని అన్నారు. గత వైసిపి పాలనలో ఎవరైతే అక్రమాలకు పాల్పడ్డారో వారే ప్రస్తుతం కూడా అక్రమాలు చేస్తున్నారన్నారు. ఇప్పటికీ చెన్నైకి ఇసుక గ్రావెల్ అక్రమంగా తరలుతుందన్నారు. వైసిపి పాలనలో విసిగిపోయిన ప్రజలు కూటమి పార్టీలకు పట్టం కట్టారని, మరలా కూడా రాష్ట్రానికి కూటమి పార్టీల ప్రభుత్వ ఆవశ్యకత ఉందన్నారు. వేల కోట్ల నిధులు కేంద్రం నుంచి వస్తున్నాయని ఎందుకు ఉదాహరణ కావలి ఉదయగిరి రోడ్డుతో పాటు అనేక సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలవుతున్నాయన్నారు. డబల్ ఇంజన్ సర్కార్ తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రభుత్వం మారిన ప్రభుత్వ అధికారుల తీరు మారలేదని, గత వైసిపి పాలన వలె అవినీతి కొనసాగుతుందన్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు ఎంపీలు అవినీతికి అడ్డుకట్ట వేయాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలో బిజెపి పార్టీ నాయకులకు కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించి, నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థల ఎన్నికల అభ్యర్థుల కేటాయింపులో తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు వడ్డే శ్రీనాథ్, జలదంకి మండల పార్టీ అధ్యక్షులు ముడి కిషోర్ రెడ్డి ఎంపీటీసీ కుట్టిపోయిన మాధవరావు యాదవ్, బిజెపి సీనియర్ నాయకులు చల్ల హనుమారెడ్డి, నాయకులు వంతేరు రాకేష్ రెడ్డి, ప్రభాకర్, సింగమనేని మదన్ కుమార్ యాదవ్, మారు బోయిన మధు యాదవ్, బిజెపి నాయకులు, పాల్గొన్నారు.

# స్వచ్ఛ సర్వేక్షన్‌లో మంచి ర్యాంక్ కోసం సమిష్టిగా కృషి చేయాలి




**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ వారి ఆదేశాల మేరకు నెల్లూరు నగర పాలక సంస్థ కమాండ్ కంట్రోల్ సమావేశ మందిరంలో నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని పబ్లిక్ హెల్త్ వర్కర్లకు ఒకరోజు 'ఘన వ్యర్థాలపై సామర్థ్యాల పెంపు' శిక్షణ కార్యక్రమం స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ వారు నియమించిన నాలెడ్జ్ పార్ట్నర్స్ అయిన ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ వారు మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నగర టీపీఆర్ఓ వాసుబాబు మాట్లాడుతూ.. ఘన వ్యర్థాల నిర్వహణ పురపాలక సంఘంలో ఎంతో కీలకమైనదని, శిక్షణ పొందిన వారు తమ పరిధిలోని వార్డులలో తడి పొడి, హానికర చెత్త లను విభజించడం, ఇంటిలో ఉత్పత్తి అయ్యే తడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేయు పద్ధతులపై అవగహహన కల్పించాలని తెలిపారు. నెల్లూరు నగరానికి స్వచ్ఛ సర్వేక్షన్‌లో మంచి ర్యాంకు సాదించాలంటే అందరం సమిష్టిగా పనిచేయాలని తెలిపారు. మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ ఓ.దినేష్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు నిబద్ధతతో అభ్యసించాలని కోరారు. అలాగే ఈ శిక్షణ లో నేర్చుకున్న అంశాలను క్షేత్ర స్థాయిలో అమలు చేయాలనీ, అమలు చేసే ముందు మనం పాటిస్తూ ఎదుటివారికి చెప్పాలని నగరంలో చెత్త నిర్వహణ, విభజన, రవాణా ఆవశ్యకతల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ నుండి రిసోర్స్ పర్సన్స్‌గా డాక్టర్ వెంకటేశ్వర రావు, దొరసాని, రేవతి ఇందులో పాల్గొని శిక్షణ ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ సిబ్బంది, శానిటరీ మేస్త్రీలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# లక్ష్యసాధన దిశగా.. కరెంటోళ్ళ జనబాట

- క్షేత్రస్థాయిలోనే వినియోగదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు
- జిల్లా సూపరింటెంటింగ్ ఇంజనీరు కే.రాఘవేంద్రం



**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** ప్రజల నిత్యవసరాల్లో ప్రధాన భాగమైన విద్యుత్ సమస్యలు గుర్తించడంతోపాటు తక్షణ చర్యలతో పరిష్కారం చూపే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ మార్గదర్శకాలు మేరకు మంగళవారం నెల్లూరు జిల్లాలోని 5 ఆపరేషన్ డివిజన్ల ఆధీనంలో ఉన్న ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో కరెంటోళ్ళ జన బాట కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీరు కె.రాఘవేంద్రం నెల్లూరు టౌన్ డివిజన్ పరిధిలోని కోటమిట్ట సెక్షన్‌లోని జెండా వీధిలో పర్యటించి, అక్కడి విద్యుత్ వినియోగదారులతో ప్రత్యక్షంగా సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద సంబంధిత సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీరు కే.రాఘవేంద్రం మాట్లాడుతూ.. వినియోగదారుల సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి తక్షణ పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ఏపీ ఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ లోతేటి శివ శంకర్ ఆదేశాల మేరకు 'కరెంటోళ్ళ జనబాట' కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ప్రతి మంగళ, శుక్రవారాల్లో క్రమం తప్పకుండా నిర్వహించబడుతుందని వివరించారు. జిల్లా అంతటా విద్యుత్ అధికారులు, సిబ్బంది ఉదయం 7.30 గంటలకే ఫీల్డ్‌కు చేరుకుని కార్యక్రమాన్ని ప్రారంభించి, లూజ్ లైన్లు, డామేజ్ అయిన విద్యుత్ పోల్స్, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్ఫార్మర్లు, చెట్ల కొమ్మలు విద్యుత్ లైన్లను తాకడం, కండక్టర్ డామేజ్ వంటి సమస్యలను గుర్తించి, ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తూ తక్షణ పరిష్కార చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా క్షేత్రస్థాయి పర్యటన ద్వారా వినియోగదారుల నుంచి వచ్చిన స్పందనపై వివరాలను సేకరిస్తున్నామని, ఈ యాప్ మరింత సమర్థవంతంగా పనిచేయడానికి క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది గమనించిన లోపాలను కార్పొరేట్ కార్యాలయం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్, నెల్లూరు టౌన్ విద్యుత్ ఆపరేషన్ డివిజన్ విభాగాలకు చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఎస్.బాలచంద్ర, మన్నేపల్లి శ్రీధర్, కోటమిట్ట సెక్షన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు నశ్రుల్లా తదితర అధికారులు, సీనియర్ సహాయకులు జీవి శివయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

# పదిలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు ఎంఈవో-2 శ్రీనివాసులు మంగళవారం పేర్కొన్నారు. ఉదయగిరి, సీతారామపురం, మర్రిపాడు మండలాల్లో పదో తరగతి విద్యనభ్యసిస్తున్న 20 మంది విద్యార్థులు విద్యలో వెనుకబడి ఉండడంతో మండలంలోని గండిపాళెం గురుకుల పాఠశాల ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రంలో చేర్పించడం జరిగిందన్నారు. వీరిని రైజింగ్ స్టార్స్ నుంచి షైనింగ్ స్టార్స్‌గా తీర్చిదిద్ది నూరు శాతం ఫలితాలు సాధించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సీతారామపురం ఎంఈవో ప్రవీణ, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గఫూర్ ఖాన్, ప్రధానోపాధ్యాయుడు రవీంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాలను సందర్శించిన ఐసీడీఎస్ పీడీ



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.హేనా సూజన్ మంగళవారం నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని గాంధీనగర్-1, గాంధీనగర్-2, గాంధీనగర్-3, నేతాజీ నగర్-2 అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాలలో అమలవుతున్న పోషకాహార పథకాలు, ప్రీ-స్కూల్ విద్య, గర్భిణీ మహిళలు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న సేవలపై ఆమె సమీక్షించారు. పిల్లల గ్రోత్ మానిటరింగ్ (బరువు, ఎత్తు నమోదు) రికార్డులను పరిశీలించి, గ్రోత్ చార్ట్‌లను ధృవీకరించారు. అదేవిధంగా కేంద్రాలలో పిల్లలకు పంపిణీ చేస్తున్న గుడ్ల (ఎగ్స్) నాణ్యత, నిల్వ, పంపిణీ విధానాన్ని పరిశీలిస్తూ ఎగ్ ట్రే వెయిట్ చూడగా 1.800 గ్రామ్స్ వున్నది .కేంద్రాలలో పిల్లలకు అందిస్తున్న ఆహారం నాణ్యత, రికార్డుల నిర్వహణ, పారిశుధ్యం, హాజరు వివరాలను పరిశీలించారు. అలాగే పిల్లల ఆరోగ్యం, ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేయాలని అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులకు ఆమె సూచనలు చేశారు. అదేవిధంగా కేంద్రాలలో మరింత మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో నెల్లూరు సీడీపీఓ టి.అరుణ, సూపర్వైజర్ ఏ.రాజేశ్వరి సంబంధిత సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

## జగనన్నను అప్రతిష్ట పాలు చేయాలనే ఉద్దేశంతోనే.. నెయ్యి కల్తీ ఆరోపణలు




**జలదంకి, మేజర్‌న్యూస్ :** మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని అప్రతిష్ట పాలు చేయాలని ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం టీటీడీ నెయ్యి లో కల్తీ జరిగిందని ఆరోపణలు చేస్తున్నారని జలదంకి మండలం వైసిపి కన్వీనర్ ఇస్కా మదన్ మోహన్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం జలదంకిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉదయగిరి నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ్ మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. వైసిపి పాలనకు ముందు రాష్ట్రంలో టిడిపి పాలన ఉందని ఆ సమయంలో టిటిడికి లడ్డూల తయారీ కోసం నెయ్యి 250 నుంచి 300 రూపాయలకే అందజేశారని, అదే జగనన్న ప్రభుత్వంలో 350 రూపాయలకు నెయ్యి అందజేయడం జరిగిందన్నారు. మరి టిడిపి ప్రభుత్వంలో అంత తక్కువ రేట్ కి నెయ్యి సర్ఫరా ఎలా సాధ్యమైందో అంత వారికే తెలియాలి అన్నారు. వైసిపి ప్రభుత్వం లో లడ్డూల తయారీలో వాడిన నెయ్యిలో ఎలాంటి జంతువుల కొవ్వు లేదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మాజీ సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రారెడ్డి, దేవరపల్లి రఘురామిరెడ్డి, సురే వెంకట శేషారెడ్డి, కోర్స పార్టీ రామిరెడ్డి, తిమ్మసముద్రం సర్పంచ్ రావి ప్రసాద్ నాయుడు, గుర్రం జగ్గయ్య, వేములపాడు సర్పంచ్ కృష్ణారెడ్డి, దేవరపల్లి మధుసూదన్ రెడ్డి, వేలమురి శ్రీధర్ రెడ్డి, పులిమీ బాబుల్ రెడ్డి, వల్లంరెడ్డి బాబుల్ రెడ్డి, కమతం సుబ్బారావు యాదవ్, శంబోతు మనోహర్ యాదవ్, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బహుమతుల ప్రదానం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక మేకపాటి రాజమోహన్ రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వక్త-2026 కార్యక్రమంలో భాగంగా మండలస్థాయిలో నిర్వహించిన వకృత్వ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు మంగళవారం కళాశాలలో బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జేవీవీ జిల్లా నాయకులు దస్త గిరిఅహ్మద్ మాట్లాడుతూ.. వక్త-2026 కార్యక్రమంలో కళాశాలలో విద్యార్థులకు మండల స్థాయిలో వకృత్వ పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ పోటీల్లో బేబీ, కళాజ్యోతి, శిరీష, పావనిరాజా, సాయిప్రసన్నలు ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్ధ, పంచమస్థానాల్లో నిలిచారన్నారు. వీరికి మండల వైసీపీ కన్వీనర్ కొండా రాజగోపాల్ రెడ్డి తన సొంత నిధులతో బహుమతులు సమకూర్చడంతో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.నారాయణస్వామి చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో దాసరిపల్లి సర్పంచ్ సయ్యద్ గౌస్ మో హిద్దీన్, వైసీపీ మండల యూత్ కన్వీనర్ ఎంఏ సలీం, అధ్యాపకులు. జేవీవీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి ముంగిటకే నారాయణ హెల్త్ ఆన్ వీల్స్

- నెల్లూరులో వైద్య విప్లవం..
- 3 కోట్లతో అత్యాధునిక మొబైల్ ఆసుపత్రి సేవలు ప్రారంభం
- ఉచిత పరీక్షలు, ఉచిత మందులు
- పేదల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా మంత్రి నారాయణ అడుగులు
- ఖరీదైన క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఇక ఉచితం



**నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :** నిరుపేదల ఆరోగ్యమే లక్ష్యంగా మంత్రి పొంగూరు నారాయణ గారు ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'నారాయణ హెల్త్ ఆన్ వీల్స్' వైద్య సేవలు పేదల పాలిట సంజీవనిలా మారాయి. సుమారు 3 కోట్ల వ్యయంతో అత్యాధునిక సాంకేతికతతో రూపొందించిన ఈ మొబైల్ ఆసుపత్రి, తాజాగా ఈరోజు మంగళవారం 48వ డివిజన్ మీరామొహిద్దీన్ దర్గా సమీపంలో వైద్య శిబిరాన్ని నిర్వహించింది. డివిజన్ ఇన్‌చార్జ్ ఇంతియాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వందలాది మంది ప్రజలు ఉచిత వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ.. ఈ వాహనంలో 12 రకాల రక్త పరీక్షలు, ఎక్స్-రే, ఈసీజీ వంటి దయాగ్నోస్టిక్ సేవలతో పాటు, నిపుణులైన ఫిజీషియన్లు, కంటి వైద్యులు అందుబాటులో ఉండి ఉచితంగా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారని, ముఖ్యంగా అత్యంత ఖరీదైన క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తుండటం విశేషం అన్నారు. ఇక్కడ నయం కాని జబ్బులు ఉన్నవారిని ప్రత్యేక బస్సుల్లో ఉచితంగా నారాయణ ఆసుపత్రికి తరలించి, ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్సలు పూర్తి చేసి, భోజన వసతి కల్పించి తిరిగి క్షేమంగా వారి ఇళ్లకు చేరుస్తున్నారన్నారు. వారానికి మూడు రోజులపాటు నగరంలోని వివిధ డివిజన్లలో పర్యటిస్తున్న ఈ సంచార వాహనం, ముఖ్యంగా మురికివాడల ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని ముంగిటకే తెస్తూ మంత్రి నారాయణ సేవా నిరతికి నిదర్శనంగా నిలుస్తోందని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పెంచలయ్య, క్లస్టర్ ఇన్‌చార్జ్ జాఫర్ భాయ్, బూత్ కన్వీనర్ నౌషాద్ భాయ్, ఫయాజ్ భాయ్, గోపి, సురేష్, నాగేశ్వరరావు తదితరులు కార్యక్రమాలను సమన్వయం చేశారు.

# కొమ్మరపూడిలో రూ.5.51 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ పనులు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని కొమ్మరపూడి గ్రామంలో 5 కోట్ల 51 లక్షల రూపాయలతో జరుగుతున్న లిఫ్ట్ ఇరిగేషన్ పనులను అధికారులతో కలసి టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నెల్లూరు రూరల్ మండలం లోని కొమ్మరపూడి గ్రామ ప్రజల చిరకాలకల అయిన లిఫ్ట్ ఇరిగేషన్ పనులను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గత ప్రభుత్వంలో పోరాడి మంజూరు చేయించినప్పటికీ నిధులు కేటాయించకపోవడంతో పనులు నిలిచిపోయేయి. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు నిధులు కేటాయించడంతో లిఫ్ట్ ఇరిగేషన్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలియజేశారు. అలాగే కొమ్మరపూడి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 4.7కి.మీ. పైప్ లైన్ పనులు ఉండగా, అందులో ఇప్పటికి 4.0కి.మీ. పైప్ లైన్ పనులు పూర్తయ్యాయి. మిగిలిన 700మీటర్ల పైప్ లైన్ పనులు సాగుతున్నాయి. మోటార్లను అమర్చి 6 నెలలలోగా ఈ పనులు పూర్తి చేసి, కొమ్మరపూడి గ్రామ ప్రజలకు అంకితం చేసేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.అలాగే నెల్లూరు రూరల్ అభివృద్ధికి సహకరిస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌కి నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రజల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడు బూడిద విజయ్ కుమార్, నెల్లూరు ఏఎంసీ చైర్మన్ మనుబోలు శ్రీధర్ రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ జలదంకి సుధాకర్, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ మండల ఇంఛార్జ్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, టీడీపీ నాయకులు మన్నెం రవీంద్ర నాయుడు, రామారావు, మలినేని దశరథ రామయ్య, నెట్టెం సురేష్ నాయుడు, ఉప్పులూరు మహేష్, వెంకటేష్, అంబటి మురళి, రాజేష్, పచ్చిపాల మురళి, రమేష్, మార్తు ప్రసాద్, మోహన్ రావు, రాజయ్య, సుందరయ్య, ముత్తంగి వెంకటేశ్వర్లు, పరంధామయ్య, కామాక్షయ్య, నరసయ్య, మల్లి, రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కోటంరెడ్డికి మీ ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలి : గిరిధర్ రెడ్డి



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 35వ డివిజన్ లేక్ వ్యూ కాలనీలో, 6లక్షల 50వేల రూపాయలతో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను స్థానిక కార్పొరేటర్ యాకసిరి వాసంతి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాబాటలో భాగంగా ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు, స్థానిక ప్రజలు లో-వోల్టేజ్ సమస్యను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా, వెంటనే అధికారులతో మాట్లాడి రూరల్ నియోజకవర్గ పరిధిలో లో-వోల్టేజ్ సమస్య ఉన్న ప్రాంతాలలో సమస్య పరిష్కారం దిశగా 1 కోటీ 40 లక్షల రూపాయలతో 14 నూతన ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశీస్సులతో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో వందలకోట్ల రూపాయల నిధులతో అభివృద్ధిపనులు జరుగుతున్నాయనిటీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి అభివృద్ధి, సంక్షేమం రెండూ రెండు కళ్ళలా భావించి పనిచేస్తున్నాము. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి రూరల్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సహాయ సహకారాలతో ఎన్నడూ లేని విధంగా రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి సారథ్యంలో అభివృద్ధి జరుగుతోందని కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డికి మీ ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి అన్నారు. పై కార్యక్రమంలో నెల్లూరు ఏఎంసీ చైర్మన్ మనుబోలు శ్రీధర్‌రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్‌లు షంషుద్దీన్, జలదంకి సుధాకర్, కో క్లస్టర్ ఇన్‌చార్జ్ లక్ష్మీరెడ్డి, 35వ డివిజన్ అధ్యక్షుడు బర్నాబాస్, టిడిపి నాయకులు తాటి వెంకటేశ్వరరావు, ఏకశిరి శరత్‌చంద్ర, మురళి, గూటూరు శ్రీధర్ నాయుడు, గురవయ్య, ప్రసాద్, వాదనల చిట్టి, అంకుష్ నాయుడు, ముణి, సుల్తాన్, ఆరిఫ్, షఫీ, నరసింహులు, వెంకటేష్‌రెడ్డి, జయరామి రెడ్డి, సి.హెచ్.మురళి, రమణయ్య, శ్రీను, మస్తాన్, జయంతి పాల్గొన్నారు.

## ఎంపీ వేమిరెడ్డిని కలిసిన టీడీపీ, జనసేన నాయకులు



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** పార్లమెంట్ సమావేశాల సందర్భంగా నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ని ఢిల్లీలోని పార్లమెంట్ ఆవరణలో మర్యాదపూర్వకంగా కలిసిన తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకులు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, జనసేన పార్టీ నాయకులు గుడి హరి రెడ్డి. ఈ సందర్భంగా కేతంరెడ్డి ఎంపీ వేమిరెడ్డి ప్రోత్సాహంతో పార్లమెంట్ భవనాన్ని పరిశీలించాను. సరికొత్త పార్లమెంట్ భవనం, దేశ భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేస్తూ.. భారతీయ సంస్కృతిని ప్రతిబింబిస్తూ ప్రజాస్వామ్య విలువలకు నిలువుటద్దంగా దర్శనం ఇవ్వడం ఆనందాన్నిస్తోందని తెలియజేశారు.

## జిల్లా టీడీపీ అధ్యక్షులుని సన్మానించిన చల్ల



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ యారం కృష్ణయ్య సొసైటీ డైరెక్టర్ కోడూరు నాగిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి భోజనపు ఆనంద్, సీనియర్ నాయకులతో కలిసి మంగళవారం ఎమ్మెల్సీ, జిల్లా తెలుగుదేశం అధ్యక్షులు బీద రవిచంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. సందర్భంగా మండల రాజకీయాలపై చర్చించుకున్నట్లు వారు తెలిపారు సొసైటీ ద్వారా రైతులకు మెరుగని సేవలు అందించాలని సూచించినట్లు ఆయన తెలిపారు.

## క్యాన్సర్ నివారణపై ప్రజలు అవగాహన పెంచుకోవాలి



**కావలి, మేజర్‌న్యూస్ :** దేశంలో రోజురోజుకీ పెరుగుతున్న క్యాన్సర్ వ్యాధిపై అవగాహన అవగాహన పెంచుకోవాలని, మెడికవర్ క్యాన్సర్ సంస్థ వైద్యాధికారిని డాక్టర్ జి. హరిప్రియ మంగళవారం కావలి పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో పాతూరు రాజీవ్ నగర్ లో క్యాన్సర్ నిదాన పరీక్షల్లో హాజరై ప్రజలకు రోగులకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న క్యాన్సర్ వైద్యురాలు డాక్టర్ జి.హరిప్రియ మాట్లాడుతూ.. మనదేశంలో ప్రతి సంవత్సరం 14 లక్షలకు పైగా కొత్తగా క్యాన్సర్ కేసులు నమోదు అవుతున్నాయని, వీటిలో అధికంగా కేసులు ఆలస్యంగా గుర్తించడం వలన ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని, ముఖ్యంగా రొమ్ము, గర్భకోశ క్యాన్సర్ వ్యాధులకు సంబంధించి నివారణకు ముందుగా ప్రాథమిక పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ప్రజలు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన పెంపొందించుకొని స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ద్వారకానాథ్ చౌదరి, డాక్టర్ మహేష్, రామ్ సెంటర్ చైర్మన్ డాక్టర్ దొడ్ల మనోహర్ రెడ్డి, మహిళలకు ఉచితంగా ఐరన్ టానిక్కులను అందజేశారు. కార్యక్రమంలో కావలి డివిజన్ లింగ నిర్ధారణ నిషేధ చట్ట సలహా సభ్యులు ఎం. మాలకొండరెడ్డి, వైద్య సిబ్బంది, ప్రసాద్, సునీత, చెన్నకేశవులు, ఆశా వర్కర్లు, మహిళలు, రోగులు తదితరులు హాజరయ్యారు.

## నల్ల చట్టాలు రద్దు చేయండి : సీపీఎం




**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నల్ల చట్టాలను తక్షణమే రద్దు చేయాలని జిల్లా సీపీఎం పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.మోహన్ రావు డిమాండ్ చేశారు. ఈనెల 12వ తేదీన ఆ పార్టీ ఆధ్వర్యంలో కార్మిక సంఘాలు నిర్వహిస్తున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ మండల కేంద్రంలో బైక్ ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రారంభించారు. 29 కార్మిక చట్టాలను పునరుద్ధరణ చేస్తూ నాలుగు లేబర్ కోడ్స్ చట్టాలను రద్దు చేయాలని కోరారు. అదేవిధంగా రైతు వ్యతిరేక చట్టాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకుంటుందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గడ్డం అంకయ్య, గోద భాస్కర్, శ్యాం ప్రసాద్, మస్తాన్ షా, వెంకయ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు

## బ్రహ్మోత్సవాల గోడపత్రికలు ఆవిష్కరణ




**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలోని స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో బోగోలు మండల కొండ బిట్రగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అధికారులతో కలిసి మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఫిబ్రవరి నెల 26వ తేదీ నుంచి మార్చి 8వ తేదీ వరకు జరగనున్న ఈ బ్రహ్మోత్సవాల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా విద్యుత్, త్రాగునీరు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత ఏర్పాట్లు, వైద్య సదుపాయాలు, ప్రసాదం, అన్నదానం, వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. అలాగే బ్రహ్మోత్సవాలు విజయవంతంగా జరగాలంటే అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పని చేయాలని భక్తుల సౌకర్యమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ప్రభుత్వ అన్ని శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యంతో సమీక్ష

**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరులోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం నందు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ వి సుజాత అధ్యక్షతన జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యంతో మంగళ వారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్వో మాట్లాడుతూ.. జిల్లాలో నిర్వహించుచున్న ప్రతి ప్రైవేట్ ఆసుపత్రి, క్లినిక్, ల్యాబ్, డయాగ్నొస్టిక్స్ సెంటర్స్ తప్పనిసరిగా ఆంధ్రప్రదేశ్ అల్లోపతి మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 2002 క్రింద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు ఐదు సంవత్సరాల గడువు తీరిన వారు మూడు నెలలు ముందుగానే రెన్యువల్ కోసం నమోదు చేసుకోవాల్సిందిగా ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాన్ని ఆదేశించారు. అదేవిధంగా ఆసుపత్రుల రిజిస్ట్రేషన్, రెన్యువల్ అంతా కూడా ఆన్లైన్ విధానం ద్వారా జరుగునని తెలియజేశారు. జిల్లాలో సదురు చట్టం కింద రిజిస్ట్రేషన్ చేసుకోకుండా నిర్వహిస్తున్న ఆసుపత్రులు, క్లినిక్లు, ల్యాబ్స్, డయాగ్నొస్టిక్ సెంటర్ లపై చట్ట పరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. అటువంటి సెంటర్లను గుర్తించడానికి సర్వే చేయుటకు ప్రణాళిక రూపొందించినట్లు తెలియజేశారు. అంతేకాకుండా సదరు చట్టం కింద రిజిస్టర్ కాబడిన ప్రతి యాజమాన్యం వారు వారి సెంటర్స్ నందు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ధరల పట్టికను తప్పనిసరిగా ప్రదర్శించవలసిందిగా ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యం వారిని హెచ్చరించారు. ప్రతి ప్రవేట్ ఆసుపత్రులు, క్లినిక్స్, డయాగ్నొస్టిక్



సెంటర్లో పనిచేస్తున్న ప్రతి డాక్టర్, స్టాఫ్ నర్స్ లకు హెల్త్ ప్రొఫెషన్ ఐడి (హెచ్‌పిఆర్) చేయవలసిందిగా, ప్రతి ఫెసిలిటీకి హెల్త్ ఫెసిలిటీ రిజిస్ట్రేషన్ (హెచ్‌ఎఫ్ఆర్) తప్పనిసరిగా చేసుకోవాల్సిందిగా ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యం వారికి తెలియజేశారు. అనంతరం హెల్త్ ప్రొఫెషనల్ ఐడి, హెల్త్ ఫెసిలిటీ రిజిస్ట్రేషన్ చేసుకునే విధానాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించి హెచ్‌పిఆర్, హెచ్‌ఎఫ్ఆర్ నమోదులో సాంకేత సహాయం కొరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వారి కార్యాలయంలో గాని, వారికి దగ్గరలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో గాని సంప్రదించాలని ఈ సందర్భంగా డిఎంహెచ్వో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఎంఓ కె కనకరత్నం, డిపిఓ కే.రమేష్ బాబు, ఏ ఎస్ఓ రమేష్, షైనీ, కళ్యాణ్ ప్రైవేట్ ఆస్పత్రిలో డాక్టర్లు, వారి ప్రతినిధులు పాల్గొన్నారు.

# శివయ్య సన్నిధిలో భక్తులకు ఇబ్బందులు రాకూడదు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని మూలాపేటలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల సందడి అప్పుడే మొదలైంది. ఈ నేపథ్యంలో నెల్లూరు ఆర్డీఓ అనూష అధికారులతో సమీక్ష నిర్వహించారు. దేవస్థానంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) అనూష అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సమన్వయ సమీక్షా సమావేశంలో ఆమె కీలక సూచనలు చేశారు. ఆర్డీవోగా రెండోసారి ఈ ఉత్సవాలను పర్యవేక్షించడం సంతోషంగా ఉందని తెలుపుతూ.. గత ఏడాది ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి మరింత మెరుగైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. విద్యుత్, అగ్నిమాపక శాఖలు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలి అని తెలిపారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడటంతోపాటు, పారిశుధ్య నిర్వహణలో ఎక్కడా లోపం రాకూడదని స్పష్టం చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా ప్రథమ చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేయాలని, 104, 108 వాహనాలతో పాటు అత్యవసర మందులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. క్యూలైన్ల నిర్మాణం పటిష్టంగా ఉండాలని, రథోత్సవం రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 'రోప్ పార్టీ'లను సిద్ధం చేయాలని, పోలీస్ బందోబస్తు ప్రణాళికాబద్ధంగా ఉండాలని సూచించారు.ఆలయ కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ భక్తులకు శీఘ్ర దర్శనం కల్పించడమే మా ప్రాధాన్యత అన్నారు. క్యూలైన్లలో వేచి ఉండే వారికి ఎండ తగలకుండా చలువ పందిళ్లు, తాగునీరు నిరంతరం అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పుట్ట అజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. భక్తుల కోసం ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, స్వామి వారి ప్రసాదం ప్రతి భక్తుడికి అందేలా చూస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపాలిటి, పోలీస్, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు, ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొని, ఉత్సవాలను విజయవంతం చేసేందుకు తమ సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో నెల్లూరు ఆర్డీఓ, ఆలయ చైర్మన్, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ ఈఓ తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్‌ను సందర్శించిన ఇన్‌చార్జ్ మేయర్, కమిషనర్

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ మేయర్ రూప్ కుమార్ యాదవ్, కమిషనర్ వైఓ నందన్ అన్ని విభాగాల అధికారులతో కలిసి స్థానిక సంతపేట మార్కెట్‌ను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ ఆదేశాల మేరకు మార్కెట్ ప్రాంగణంలో అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించి వ్యాపారాలు చేసుకునేందుకు వీలుగా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రాంగణంలోని 160 దుకాణాలలో ఇప్పటికే 125 దుకాణాలలో వ్యాపారాలు జరుగుతున్నాయని, 35 దుకాణాలు ఇంకా ఖాళీగా ఉన్నాయని తెలిపారు. మార్కెట్ ప్రాంగణంలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని మేయర్ స్పష్టం చేశారు. కమిషనర్ మాట్లాడుతూ.. మార్కెట్ అభివృద్ధికి అవసరమైన అన్ని ప్రణాళికలను రూపొందించి మంత్రికి



నివేదించనున్నామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కప్పిర శ్రీనివాసులు, రేవతి,నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ రహంతు జానీ, టౌన్ ప్లానింగ్ సిపి రఘునాధరావు, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి




**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గం లోని 30వ డివిజన్ కొత్తూరు శ్రామిక నగర్, ఆటో స్టాండ్ నందు ఫిబ్రవరి 12 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో కరపత్రాలు పంచి బ్యానర్లు కట్టడం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు కండె కోటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక రైతు వ్యతిరేక విధానాలు అమలు చేస్తుంది. మోటార్ వెహికల్ చట్టం 2019 సవరించాలి. ఇన్సూరెన్స్ రంగంలో 100శాతం ఎఫ్డిని రద్దు చేయాలి. నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేసి గతంలో సాధించుకున్న కార్మికుల చట్టాలను అమలు పరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్టాండ్ కార్యదర్శి సయ్యద్ హమీద్, దయాకర్ ఆటో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థ పనితీరును పరిశీలన




**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ నగరంలోని ఏడు ప్రధాన జంక్షన్లలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థ పనితీరును అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. స్థానిక డీకే మహిళా కళాశాల, కెవిఆర్ పెట్రోల్ జంక్షన్, విఆర్‌సి, కనకమహల్, రామలింగాపురం ప్రాంతాలలో ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థ పని చేసే విధానం పరిశీలించి అధికారులకు వివిధ సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్‌ఈ రహంతు జానీ,లైటింగ్ డిఈఈ. ముజాహిద్దీన్, ట్రాఫిక్ సీఐలు వెంకటరెడ్డి, రామకృష్ణ, మ్యాట్రిక్స్, ఎస్పిటి నెట్వర్క్స్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## వ్యర్థాలు వేసిన చికెన్ షాప్ యజమానులకు జరిమానా



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణ భాగంగా మంగళవారం స్థానిక 21వ ఎన్‌జిఓ కాలనీ, వనంతోపు, రవీంద్ర నగర్, డివిజన్ ఉమ్మారెడ్డి గుంట, తదితర ప్రాంతాలలో అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికంగా ఉన్న చికెన్ షాపు నుంచి వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయడం గమనించి షాపు నిర్వాహకులకు జరిమానా విధించాలని శానిటేషన్ విభాగం అధికారులను ఆదేశించారు. అలాగే బిగ్ బాస్కెట్ సంస్థ నిర్వాహకులు పారిశుధ్య నిర్వహణ పనులలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కారణంగా జరిమానా విధించాలని కమిషనర్ ఆదేశించారు. అనంతరం స్థానికంగా డివిజన్లో జరిగిన పలు ఇంజనీరింగ్ సివిల్ వర్క్స్ రోడ్లు, డ్రైయిన్ కాలువలు తదితర నిర్మాణ పనులలో నాణ్యతను కమిషనర్ తనిఖీ చేసి ఇంజనీరింగ్ అధికారులకు వివిధ సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర పాలక సంస్థ ఆరోగ్య శాఖ అధికారి ఓ.దినేష్ ఇంజనీరింగ్ విభాగం, శానిటేషన్ విభాగం అధికారులు, రెవెన్యూ, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## డాక్టర్ కుటుంబ సభ్యులకు వైసీపీ పరామర్శ



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని దేవి నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ వంగల నాగేశ్వర రెడ్డి అనారోగ్య కారణాలతో సోమవారం మృతి చెందారు. నాగేశ్వర్ రెడ్డి మరణ వార్త తెలుసుకున్న మాజీ మంత్రి వర్యులు, వైసీపీ రాష్ట్ర పీఏసీ సభ్యులు నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి మంగళవారం వారి నివాసానికి వెళ్లి ఆయన పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి మనోధైర్యం ప్రసాదించాలని భగవంతుని కోరుకున్నట్లు చెప్పారు. ఆయనతోపాటు వైసిపి నాయకులు షేక్ షాహుల్, చెర్లో సతీష్ రెడ్డి, కలువ బాల శంకర్ రెడ్డి, కౌన్సిలర్లు యానాది రెడ్డి, షకీలా బేగం, ప్రమీలమ్మ తదితరులున్నారు.

## బారా షహీద్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముస్లిం మైనార్టీ నాయకులు బారా షహీద్ దర్గాలో మంగళవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పేద మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు షంషుద్దీన్, సాబీర్ ఖాన్, షేక్ మస్తాన్, రియాజ్, అబ్దుల్ రసూల్, మునీర్, ఖాదర్ బాషా, జిలాని, మీరా, సందాని భాషా, శ్యామ్, రవి, జాబీర్, బషీర్, సుల్తాన్ ముజామిల్, మనోహర్, జహీర్, కాలేషా, ఖాజా తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఎల్లప్పుడూ పేదల సంక్షేమం కోసం పనిచేసే నాయకుడని, పేదల హృదయాల్లో స్థానం సంపాదించుకున్న వ్యక్తి అని ప్రశంసించారు. అలాంటి నాయకుడు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అల్లాహ్‌ను ప్రార్థించారు.



## వీపీఆర్ నేత్ర వైద్య సేవలపై ప్రజల ప్రశంసలు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వీపీఆర్ నేత్ర వైద్య సేవలపై ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డిలు పేద ప్రజలకు కంటి వైద్యం అందించాలని ఉద్దేశంతో పిఆర్ వైద్య నేత్ర వాహనాన్ని సమకూర్చి నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల వారికి కంటి చూపులు ప్రసాదించాలని ఉద్దేశంతో నిరంతరం కృషి చేస్తున్నారు. ఎక్కడో మారుమూల ప్రాంతంలో కంటిచూపు కరువై అల్లాడిపోతున్న పేద వారి పట్ల కరుణ గలిగి వారికి వారికి ఒకంత కంటిచూపులు ప్రసాదించి ఈ ప్రకృతిలోని అందాలను చూసే భాగ్యాలను కల్పిస్తున్న వారి సేవలను ప్రజలంతా ప్రశంసిస్తున్నారు ఇలాంటి మహానుభావులు మన నియోజకవర్గానికి రావడం మనందరి అదృష్టమని భావిస్తున్నారు. వింజమూరు మండలంలోని అన్ని పంచాయతీలలో ప్రజలకు మెరుగైన కంటి చూపును ప్రసాదించి వారి తోడుగా నిలుస్తున్నందున ప్రజలు ఎంతో హర్షిస్తున్నారు అందులో భాగంగానే మంగళవారం లెక్కలవారి పాలెం సాతాను వారి పాలెం నేరేడుపల్లి గ్రామాలలో ఈ కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి సుమారు 650 పైగా కంటి సమస్యలతో బాధపడేవారు హాజరయ్యారు. వారికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలను అందజేశారు అందజేసిన అద్దాలు కూడా నాణ్యమైన ఉండడంతో అందుకున్నవారు. ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ గూడా నర్సారెడ్డి వనిపెంట వెంకటసుబ్బారెడ్డి సీఎం ఖాజావలి కోడూరు నాగిరెడ్డి చల్లా శ్రీనివాసులు యాదవ్ దిద్దిగుంట శ్రీనివాసరెడ్డి ఎమ్మెస్ నాయుడు కంచర్ల శ్రీనివాసులు జనసేన మండలాధ్యక్షుడు బండారు సత్యనారాయణ రాయలసీమ. జనసేన ప్రోగ్రాం కన్వీనర్ కమతం శ్రీనివాసులు యూనిట్ ఇన్చార్జి తేళ్ల వెంకటేశ్వర్లు బూత్ కన్వీనర్ గుమ్మ మహేంద్ర తిరుపతి ఆచారి ఎన్నపల్లి పెంచలరావు శ్రీనివాసులు మాచర్ల శ్రీను ఆయా గ్రామాల నాయకులు పెద్దలు తదితరులు ఉన్నారు.

## రాష్ట్ర బడ్జెట్లో హై లెవెల్‌కు నిధులు కేటాయించాలి



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమశిల హై లెవెల్ కెనాల్ సాధన కమిటీ, అఖిలపక్ష రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. 2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో సోమశిల హై లెవెల్ కెనాల్ ఆగిపోయిన పనులకు తక్షణం నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సీనియర్ నాయకుడు చంద్ర రాజగోపాల్ మాట్లాడుతూ, ప్రాజెక్టులకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని ఆరోపిస్తూ, మొత్తం రూ.2000 కోట్ల అంచనా వ్యయంతో ఉన్న ఈ కెనాల్‌కు రూ.1500 కోట్లు కేటాయించినప్పటికీ 50 శాతం పనులు కూడా పూర్తికాలేదని తెలిపారు. కనీసం రూ.700 కోట్లు కేటాయించి పనులు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా రైతు సంఘం కార్యదర్శి మూలి వెంగయ్య మాట్లాడుతూ, మెట్ట ప్రాంతమైన మర్రిపాడు మండలానికి సాగు, తాగునీటి అవసరాల కోసం ప్రారంభించిన ఈ ప్రాజెక్టు గత 15 ఏళ్లుగా నత్తనడకన సాగుతోందని, నిధుల లేమితో కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అవుతోందని అన్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపించి వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరారు. మండల వైసీపీ సీనియర్ నాయకుడు గంగవరపు శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ, మర్రిపాడు, ఉదయగిరి, ఆత్మకూరు ప్రాంతాల్లో భూగర్భ జలాల కొరతతో భూములు బీడుభూములుగా మారుతున్నాయని, కెనాల్ పనులను త్వరితగతిన పూర్తి చేసి సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు, రైతులు, వివిధ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## శివరాత్రికి శివాలయాలు ముస్తాబు

● కండలేరుగట్టున పరశురాముడు ● నిర్మించిన విశిష్ట దేవాలయం ● దక్షణ వాకిలి ఈ దేవాలయం ప్రత్యేకం



**మనుబోలు, మేజర్‌న్యూస్ :** శివరాత్రి కోసం శివ క్షేత్రాలు ముస్తాబవుతున్నాయి. శివరాత్రి ముక్కోటికి ఎక్కడలేని ప్రాధాన్యత ఉంది. హిందువులు ఈ రెండు రోజులలో చాలా భక్తిగా శివరాత్రి రోజు ఉపవాసాలు ఉంటారు పూజలు చేస్తారు. మండల కేంద్రమైన మనుబోలు లో బ్రహ్మేశ్వర ఆలయం, కండలేరు గట్టున పరశురాముడుచే నిర్మించిన శ్రీ కామాక్షితాయి సమేత సంగమేశ్వర దేవాలయం అతి ప్రాచీన పురాతన మైన విశిష్టమైన దేవాలయాలు. కండలేరు గట్టున పరశురాముడు అష్ట లింగాన్ని ప్రతిష్టించి మనుబోలును భారతదేశ చిత్రపటంలో నిలిపారు. శాపవిమోచన కోసం 2026 సంవత్సరాల క్రితంఇక్కడ పరశురాముడు అష్ట లింగం ప్రతిష్టించిన ఆధారాలు ఉన్నాయి. ఇక్కడ నాగలిపిలో పరశురాముడు సంచరించిన ఆనవాళ్లు ఉన్నాయి. తన తల్లి రేణుకా దేవిని తండ్రి జమదగ్ని ఆదేశాల మేరకు గండ్ర గొడ్డలితో శిరచేధనంచేసి పరశురాముడు శాపానికి గురి అవుతాడు. తల్లి హత్య మహాపాతకం నుండి శాప విమోచన కొరకు మూడు నదులు కలిసే చోట్ల ఏడు శివలింగాలను ప్రతిష్టిస్తే శాప విమోచనకోసం కండలేరు గట్టున పరశురాముడు అష్ట లింగాన్ని ప్రతిష్టించినట్లు ఇతిహాసాలు చెబుతున్నాయి. ఒక్క నెల్లూరు జిల్లాలోనే గూడలి ఆత్మకూరు దగ్గర సంఘం మనుబోలు వద్ద శివలింగాలను ప్రతిష్టించినట్లు పురాణాలు ఘోషిస్తున్నాయి. పరశురాముడు స్వయంగా ఇక్కడ అష్ట లింగాన్ని ప్రతిష్టించడంతో దేశ వ్యాప్తంగా ఇక్కడ దేవాలయం ప్రాచీనమైనదిగా విశిష్టత ఏర్పడింది. ఇక్కడ ఏటా ఏప్రిల్ 14వ తేదీ శ్రీ కామాక్షి తాయి సమేత సంగమేశ్వర స్వామి కళ్యాణం వైభవంగా నిర్వహిస్తారు. ఆనాటి నుండి ఇప్పటివరకు శివరాత్రి ఏప్రిల్ 14వ తేదీ ఇక్కడ దేవాలయానికి ఎక్కడలేని భక్తుల తాకిడి ఉంటుంది. తరచూ జిల్లా వ్యాప్తంగా భక్తులు ఈ దేవాలయానికి వచ్చి ప్రత్యేక పూజలు చేస్తుంటారు. శివరాత్రి రోజు భారీ సంఖ్యలో భక్తులు ఈ దేవాలయానికి విచ్చేస్తారు ఆరోజు అష్ట లింగం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. నెల్లూరు గూడూరు. మనుబోలు మండలంలోని అన్ని గ్రామాల నుండి భక్తులు భారీ సంఖ్యలో శివరాత్రి రోజు వచ్చి పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటారు అదేరోజు అన్నదానం కూడా చేస్తారు. ఇక మనుబోలు లోని బ్రహ్మేశ్వర ఆలయంలో శివరాత్రి రోజు భక్తులు పోటెత్తుతారు. శివరాత్రి జాగారం చేస్తారు. మండలంలోని పిడూరు. బద్దివోలు పిడూరుపాలెం. కొలనకుదురులో వహినేశ్వర స్వామి ఆలయం మండలంలోని శివాలయాల్లో ప్రసిద్ధి చెందినవి. శివరాత్రి నాటికి ఈ దేవాలయాలకు ఎల్లలు వేసి భక్తుల పూజల కోసం భారీ ఏర్పాట్లు చేస్తారు.

## వ్యవసాయ యాంత్రీకరణకు కొత్త ఊపిరి



**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని మల్లిఖార్జునపురం గ్రామంలో రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని వ్యవసాయ యాంత్రీకరణ దిశగా కీలక ముందడుగు పడింది. గ్రామంలోని రైతులు ఎదుర్కొంటున్న కూలీల కొరత, పెరుగుతున్న సాగు ఖర్చులను తగ్గించాలనే లక్ష్యంతో రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ట్రాక్టర్‌తో పాటు గడ్డి కోత యంత్రాన్ని గ్రామానికి తీసుకువచ్చారు. ఈ యంత్రాల వినియోగం ద్వారా పంటల సాగు, కోత, మేత తయారీ వంటి వ్యవసాయ పనులు మరింత సులభంగా, సమయపాలనతో పూర్తవుతాయని రైతులు భావిస్తున్నారు. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు ఈ యంత్రాలు ఎంతో ఉపయోగకరంగా ఉండి, వారి ఆదాయాన్ని పెంచే దిశగా దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా గ్రామాన్ని స్వావలంబన దిశగా నడిపించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ గ్రామస్థులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## ఘనంగా పోలేరమ్మ అమ్మవారి సద్ది పూజలు

**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని వరిగొండ గ్రామంలో వెలసిన గ్రామదేవత శ్రీ పోలేరమ్మ అమ్మవారికి మంగళవారం భక్తులు భక్తి శ్రద్ధలతో సద్ది పూజా కార్యక్రమాన్ని సంప్రదాయ బద్ధంగా ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారి ఆలయంలో పూజారులు శాస్త్రోక్తం గా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా, అనంతరం అమ్మవారికి నైవేద్యంగా సద్ది సమర్పించారు. పూజా కార్యక్రమంలో గ్రామ మహిళలు కలశాలతో, పురుషులు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంగణాన్ని భక్తిమయంగా మార్చారు. అమ్మవారి కటాక్షంతో గ్రామంలో రోగాలు, అపశకునాలు, ప్రకృతి విపత్తులు దూరమై, సుఖసంతోషాలు, ఆరోగ్యం, ఐశ్వర్యం వర్ధిల్లాలని భక్తులు మనస్ఫూర్తిగా ప్రార్థించారు. సద్ది పూజ అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేయగా, గ్రామంలో ఆధ్యాత్మిక శాంతి, ఐక్యతను మరింత బలపరిచిందని గ్రామ పెద్దలు తెలిపారు. పోలేరమ్మ అమ్మవారి అపార కృపతో వరిగొండ ఎల్లప్పుడూ సుఖశాంతులతో, సమృద్ధిగా ఉండాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.

## భవన నిర్మాణ పనుల పరిశీలన



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక మేకపాటి రాజమోహన్ రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జరుగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను మంగళవారం ఏపీఈడబ్ల్యూఐడీసీ డీఈ సుబ్బారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం ఉషశ్రీ పథకంలో భాగంగా కళాశాలకు రూ.5కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. అందులో రూ.3.50 కోట్లతో తరగతి గదులు, రూ.75లక్షలతో తరగతి గదుల మరమ్మత్తు పనులు, రూ.75 లక్షలతో కళాశాలకు ఫర్నీచర్, ల్యాబ్ సౌకర్యం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. తరగతి గదులకు సంబంధించి ఇప్పటి వరకు రూ.కోటి ఖర్చు చేయడం జరిగిందన్నారు. మొదటి అంతస్తు నిర్మాణ పనులు ప్రారంభించాలి. ఉందన్నారు. భవన నిర్మాణ పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. అనంతరం అధికారులు, గుత్తేదారులకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్. నారాయణస్వామి, కాంట్రాక్టర్లు గడ్డం శ్రీనివాసులు, బొజ్జా శ్రీనివాసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వెలుగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని ఆందోళన



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** బడ్జెట్ సమావేశాల్లో వెలుగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి త్వరితగతిన పూర్తి చేయాలని రైతుసంఘం, వెలుగొండ సాధన కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రైతులు స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడుతూ.. అసంపూర్తిగా ఉన్న వెలుగొండ, పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్లను వెంటనే పూర్తి చేసి మెట్ట ప్రాంతాల్లో సాగు, తాగునీటి కష్టాలు తీర్చి వలసలు నివారించాలన్నారు. అలాగే సీతారాం సాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని మెట్ట ప్రాంతాలకు సాగు, తాగునీటి కష్టాలు తీరాలంటే ఆయా ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయాలన్నారు. 1996లో వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణానికి పునాది వేశారని, అప్పటి నుంచి ప్రాజెక్టు పనులు నత్తతో పోటీ పడుతున్నాయన్నారు. 65శాతం పనులు పూర్తి చేసుకున్న వెలుగొండ ప్రాజెక్టుకు బడ్జెట్లో రూ.4,500 కోట్లు నిధులు కేటాయించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారు షాజియాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాయబ్ రసూల్, మన్నేటి మస్తాన్ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## శివరాత్రి ఉత్సవాలకు రమేష్ రెడ్డి విరాళం



**సీతారామపురం, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి నియోజకవర్గంలో జరనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ నాయ కులు ముడమాల రమేష్‌రెడ్డి భారీ విరాళాన్ని ప్రకటించారు. ప్రముఖ శైవ క్షేత్రాలు అయిన సిద్దేశ్వర ఆలయం, రామయ్య స్వామి మఠం, దుత్తలూరు బైరవకొండ, ఎర్రపల్లిగడ్డ కాశినాయన ఆశ్రమంలలో పూల అలంకరణకు తీర్థప్రసాదాలకు ఆర్థిక సాయం చేయడం జరుగుతుందని తెలిపారు. శైవ క్షేత్రాలను దర్శించుకునే భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తానని తెలిపారు. ఈ విషయమై ఆలయ పూజారులతో ఎప్పటికప్పుడు చర్చ జరుపుతున్నానని, పెద్దల సహకా రంతో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగేలా చూస్తానని తెలిపారు.

# పారిశుద్ధ్యం అస్తవ్యస్తం, దోమల నివారణ చర్యలు శూన్యం



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండలంలోని గులించేర్లలో దోమల బెడదతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు. గులించెర్ల పంచాయతీ పరిధిలో దోమల బెడదతో ప్రజలు వేగలేక పోతున్నారు. చీకటి పడితే చాలు ముసురుతున్న దోమలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దోమల బెడదను తట్టుకునేందుకు ప్రజలు మస్కిటో కాయిల్స్, అగర్ వత్తులు వినియోగించాల్సి వస్తోంది. చీకటి పడితే చాలు దోమల బెడద భరించలేక పోతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దోమల నివారణకు పంచాయతీ ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.సాధారణంగా సంధ్య సమయంలో ఇంటి తలుపులు తెరిచి ఉంచుతారు. కానీ పంచాయతీలో మాత్రం దోమల బెడద వల్ల తలుపులు మూసి ఉంచే పరిస్థితి నెలకొన్నది. రాత్రివేళ బయట కూర్చోవాలంటే దోమలతో ఇబ్బందిగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు. వేకువజామున పాలు పితకాలన్నా ఫ్యాన్ పెట్టుకోవాల్సి వస్తుందని పలువురు పేర్కొన్నారు. గత నెల రోజులుగా దోమల సమస్య మరింత పెరిగిందని చెబుతున్నారు.

### పారిశుద్ధ్యం అస్తవ్యస్తం..

సైదాపురం మండలం గుళించెర్ల పంచాయతీ పరిధిలో పారిశుధ్యం కార్మికులు లేకపోవడంతో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించక వీధులలో దోమలకు నిలయంగా మారాయి. మరోవైపు కాలువల దగ్గర వ్యర్థాలు నిండిపోవడంతో మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచిపోతుంది. ఈ పరిస్థితి దోమల వృద్ధికి అనుకూలంగా మారింది. గులించేర్లలో తదితర ప్రాంతాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. పంచాయతీ మోటార్ పంపు వద్ద కంపు కొడుతుండగా, దోమల బెడద రోజురోజుకు పెరుగుతోంది.

### దోమల నివారణ చర్యలు శూన్యం

సైదాపురం మండలం గులించర్ల పంచాయతీలో దోమల నివారణ చర్యలు కానరావడం లేదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఫాగింగ్ యంత్రాలు ద్వారా ఒకసారి కూడా ఫాగింగ్ చేయలేదని విమర్శలు ఉన్నాయి. చెత్తాచెదారం ఉన్నచోట ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ బ్లీచింగ్ పౌడర్ చల్లకపోవడంతో దోమల బెడద పెరుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. దోమల నివారణ కోసం పకడ్బందీ చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు అనారోగ్యం బారిన పడే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా మండల అధికారులు మరియు పంచాయతీ అధికారులు స్పందించి, తగు చర్యలు చేపట్టాలని బాన్సువాడ ప్రజలు కోరుతున్నారు.

# ట్రాన్స్ ఫార్మర్స్ మరమ్మత్తు కేంద్రం ఆకస్మిక తనిఖీ

● తాగునీరు, రైతులకు తొలి ప్రాధాన్యం ● వేసవి దృష్ట్యా యుద్ధ ప్రాతిపదికన రిపేర్లు ● ట్రాన్స్ ఫార్మర్ ఫెయిల్యూర్స్ తగ్గించడమే లక్ష్యం ● ఫీల్డ్, ఎఎస్‌పీఎం ఇంజనీర్లతో జాయింట్ ఇన్స్ పెక్షన్లు తప్పనిసరి ● ఏపీ ఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ కృష్ణారెడ్డి



**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** ఆంధ్ర ప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీ ఎస్పీడీసీఎల్) చీఫ్ జనరల్ మేనేజర్ ఓ అండ్ ఎం)ఎం.కృష్ణారెడ్డి మంగళవారం నెల్లూరు విద్యుత్ భవన్ ఆవరణలో ఉన్న ట్రాన్స్ ఫార్మర్స్ మరమ్మత్తుల కేంద్రం ఎస్పిఎంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు సిబ్బందిని ఉద్దేశించి చీఫ్ జనరల్ మేనేజర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. నెల్లూరు జిల్లా విద్యుత్ పంపిణీ సంస్థ ఆధీనంలో ఉన్న నెల్లూరు, కావలి, ఆత్మకూరు, పొదలకూరు ప్రాంతాల్లో 4 విద్యుత్ సంస్థకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మత్తు కేంద్రాలు, అదనంగా మరో 4 ప్రైవేట్ మరమ్మత్తు కేంద్రాలు 24 గంటల పాటు పనిచేస్తున్నాయని తెలిపారు. వేసవి కాలంలో ట్రాన్స్ ఫార్మర్ల ఫెయిల్యూర్స్ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున, వెంటనే రిపేర్ చేసి పంపే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి సరఫరా ట్రాన్స్‌ఫార్మర్లు, రైతులకు సంబంధించిన ట్రాన్స్ఫార్మర్లు ఫెయిల్యూర్స్‌ను గుర్తించిన వెంటనే యుద్ధ ప్రాతిపదికన రిపేర్ చేసి సరఫరా పునరుద్ధరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఒక ట్రాన్స్‌ఫార్మర్‌ను రిపేర్ చేసేందుకు సగటున రూ.25వేల వరకు ఖర్చవుతుండటంతో, ఫెయిల్యూర్స్ అనేవి విద్యుత్ పంపిణీ సంస్థకు పెను భారంగా మారుతున్నాయని తెలిపారు. ట్రాన్స్ ఫార్మర్ ఓవర్‌లోడింగ్ జరగకుండా చూడటం ఫీల్డ్ ఇంజనీర్ల ప్రధాన బాధ్యతగా గుర్తించాలన్నారు. ఫీల్డ్‌లో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిన ప్రతిసారి, ఎందుకు కాలిపోయిందనే అంశంపై సమగ్ర దర్యాప్తు చేసి నివేదిక పంపాలని ఆదేశించారు. ఫీల్డ్, ఎఎస్‌పీఎం ఇంజనీర్లు కలిసి జాయింట్ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్ స్థాయి తక్కువగా ఉన్నట్లయితే వెంటనే ఆయిల్ మార్పిడి చేయాలని సూచించారు. ఎఎస్‌పీఎం షెడ్‌లలో పనిచేస్తున్న సిబ్బంది కష్టాన్ని అభినందిస్తూ, అవసరమైన చోట సమయానికి ట్రాన్స్ ఫార్మర్లు అందజేసే విధంగా సంబంధిత అధికారులు నిరంతరం సమన్వయం పాటించాలి అని సూచించారు. రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని ట్రాన్స్ ఫార్మర్ల రిపేర్ల కోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. తనిఖీలో పాల్గొన్న అధికారులు జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీరు కె.రాఘవేంద్రం, టెక్నికల్, నెల్లూరు టౌన్ విద్యుత్ ఆపరేషన్, ట్రాన్స్ ఫార్మర్స్ డివిజన్ విభాగాలకు చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు శేషాద్రి బాలచంద్ర, మన్నేపల్లి శ్రీధర్, లక్ష్మీనారాయణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రాజాబాబు, అసిస్టెంట్ ఇంజనీరు సునీల్‌కుమార్‌లు పాల్గొన్నారు.

## మండల పరిషత్ కార్యాలయ టైపిస్ట్ మృతి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు మండల పరిషత్ కార్యాలయంలో సుదీర్ఘకాలం తోపాటు టైపిస్టుగా సేవలందించిన సిద్ధవటం రఘునాథరెడ్డి మృతి చెందడం స్థానికంగా విషాదాన్ని నింపిందనీ ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి డిప్యూటీ ఎంపీడీవో కే.రామారావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న రఘునాథరెడ్డి (50) సోమవారం తెల్లవారుజామున అనారోగ్యంతో కన్నుమూశారు గత కొంతకాలంగా ఆయన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు రఘునాథ్ రెడ్డికి వింజమూరు మండల పరిషత్ కార్యాలయంతో విడదీయరాని అనుబంధాన్ని కలిగి ఉన్నారని ఆయన తన విధులను వివిధ విడతలగా 2011 నుండి 2019 వరకు 2022 నుండి 2026 వరకు పనిచేస్తూ మృతి చెందడం బాధాకరమన్నారు. రఘునాథరెడ్డి కేవలం ఉద్యోగి గానే కాకుండా ప్రజలతో ఎంతో సఖ్యతగా మెలిగే వారిని కార్యాలయంకు వచ్చే సామాన్య ప్రజలను ఎంతో ఆప్యాయంగా పలకరించేవాడని వారి సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు ఎప్పుడూ ఉత్సాహంగా ఉంటూ తోటి సిబ్బందితో కలివిడిగా ఉండేవారు ఉన్నారు. ఆయన అకాల మరణం పట్ల వింజమూరు మండల ప్రజా ప్రతినిధులు రెవెన్యూ, పంచాయతీరాజ్ విభాగాల నుండి సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు ఆయన మృతితో మండల పరిషత్ కార్యాలయంలో ఒక నిబద్ధత కలిగిన ఉద్యోగం కోల్పోయామని సహచర ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## సద్విమర్శలను సైతం సాదరంగా స్వీకరిస్తా

▶ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని కందమూరు నుండి ఉప్పుటూరు వరకు 2 కోట్ల 65 లక్షల రూపాయలతో నిర్మించిన బిటి రోడ్డు మరియు సీసీ రోడ్లను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు లేనివేళ గ్రామాల్లో వివాదాలకు పోకుండా అభివృద్ధికి సహకరించాలని కోరారు.అలాగే నెల్లూరు రూరల్ ప్రజలు ఒకటికి మూడుసార్లు నన్ను గుండెల్లో పెట్టుకొని భారీ మెజారితో గెలిపించారు. అలాగే ప్రజలందరూ మంచి మనసుతో వచ్చే సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఏఎంసీ చైర్మన్ మనుబోలు శ్రీధర్ రెడ్డి, మండల పరిషత్ అధ్యక్షుడు బూడిద విజయ్ కుమార్, క్లస్టర్ ఇంఛార్జ్ జలదంకి సుధాకర్, జెడ్.పి. కోప్షన్ మెంబర్ అల్లాబక్షు, టీడీపీ మండల కన్వీనర్ పముజుల ప్రదీప్, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ మండల ఇంఛార్జ్ వేమిరెడ్డి సురేంద్ర రెడ్డి, ఉప సర్పంచ్ చెవూరు మధుసుధన్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## రికార్డుల తనిఖీ, ట్రాన్స్ ఫార్మర్స్ స్టాక్ పరిశీలన

● రికార్డుల నిర్వహణ క్రమబద్ధంగా ఉండాలి
● చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.కృష్ణారెడ్డి



**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణి సంస్థ.. నెల్లూరు సర్కిల్ ఆధీనంలో ఎస్పీఎం షెడ్‌లో నిర్వహించబడుతున్న అన్ని రికార్డులను మంగళవారం సాయంత్రం చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.కృష్ణారెడ్డి కృష్ణారెడ్డి సమగ్రంగా పరిశీలించారు. హెల్తీ ట్రాన్స్ ఫార్మర్స్, సిక్ ట్రాన్స్ ఫార్మర్స్‌కు సంబంధించిన లెక్కలను క్షుణ్ణంగా పరిశీలించి, వాటికి సంబంధించిన స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఇదే క్రమంలో ట్రాన్స్ ఫార్మర్స్ మరమ్మతుల స్థితి, ఇన్‌వర్డ్, అవుట్‌వర్డ్ వివరాలు సక్రమంగా నమోదు అవుతున్నాయా, అన్న విషయాలపై అడిగి తెలుసుకోవడంతోపాటు అందుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్స్‌కు సంబంధించిన ఆయిల్ రిజిస్టర్లను ప్రత్యేకంగా పరిశీలించి, ఆయిల్ వినియోగం, రీప్లేస్‌మెంట్ వివరాలు నిబంధనల ప్రకారం నమోదు అవుతున్నాయా లేదా అని చెక్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రికార్డుల నిర్వహణ మరింత పారదర్శకంగా, క్రమబద్ధంగా ఉండేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన వెంట సూపరిండెంటింగ్ ఇంజనీరు కే.రాఘవేంద్రం, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు బాలచంద్ర, మన్నేపల్లి శ్రీధర్, లక్ష్మీనారాయణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు తదితరులు ఉన్నారు.

## విద్యార్థిని లక్ష్మికి నగదు ప్రోత్సాహక బహుమతి



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలోని స్థానిక క్రిస్టియన్ పేటలో పద్మజా నర్సింగ్ నందు మంగళవారం 2024-25 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో అత్యుత్తమ మార్పులు సాధించిన విద్యార్థిని లక్ష్మిని డాక్టర్ సుబ్బారెడ్డి పద్మజాలు ప్రోత్సాకాన్ని వారి వైద్యశాలలో అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యార్థిని కష్టపడి ఇష్టముతో, చదివితే పేదరికం ఎప్పుడూ అడ్డు రాదని, లక్ష్యం పట్ల చిత్తశుద్ధి ఉంటే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని మనిషిలో ఏదైనా దొంగిలించవచ్చు కానీ చదువు విజ్ఞానాన్ని ఎవరు దొంగిలించలేరని వారు తెలిపారు. లక్ష్మిని ఇతర విద్యార్థులు స్ఫూర్తి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి గాదిరెడ్డి హరినాథ్, కోశాధికారి డి.సుబ్బరామ శర్మ, జన విజ్ఞాన వేదిక ఉపాధ్యక్షులు పాపిశెట్టి జానకిరామ్, ఎస్కే జమీర్ జన విజ్ఞాన వేదిక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విజిలెన్స్ దర్యాప్తు అసంపూర్తిగా ఉంది..

హౌసింగ్ పెద్దలను వదిలేసి కిందిస్థాయి అధికారులు, కాంట్రాక్టర్ల లక్ష్యంగా దర్యాప్తు జరిపారు : బీజేపీ నేత మిడతల రమేష్



**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** జిల్లాలోని గృహ నిర్మాణ శాఖలో జరిగిన అవినీతి కుంభకోణాలపై విజిలెన్స్ చేపట్టిన దర్యాప్తు అసం పూర్తిగా ఉందని బిజెపి నమామిగంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ పేర్కొన్నారు. సోమవారం నెల్లూరు జిల్లా కేంద్రంలో జరిగిన హౌసింగ్ అధికారుల సమావేశానికి హాజరైన స్టేట్ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ బాబును బిజెపి నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసిన బిజెపి నాయకు రాలు కందిగట్ల రాజేశ్వరి వినత పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మిడతల రమేష్ మాట్లాడుతూ.. ఉచిత ఇసుక, టెన్ మెటీరియల్స్ కొనుగోలు, టన్నుకు రూ.10వేలు అదనంగా స్టీల్ కొనుగోలు, లెవెలింగ్ కోసం ఓటీఎస్ నిధులుపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉచితకు ఇసుక పాలసీ జీవో విడుదల చేశారని, అయితే రూ.900 కోట్లు ఇసుక చెల్లింపులు పేరుతో జేపీ వెంచర్ సంస్థకు చెల్లింపులు ఉన్నతాధికారులు జరిపారన్నారు. టన్ను స్టీల్ బయట మార్కెట్లో కంటే రూ.9 నుండి రూ.10వేల చొప్పున అధిక ధరలు చెల్లించి 2 లక్షల టన్నుల స్టీలు కొనుగోలు చేసి కుంభకోణానికి పాల్పడ్డారని, తలుపులు కిటికీలు ద్వార బంద్రాలు, ఎలక్ట్రిషన్, శానిటేషన్, వాటర్ ట్యాంక్‌ల పేరుతో రూ.300 కోట్లు మెటీరియల్ నిధులు అధికారులు దోపిడీ చేశారన్నారు. లే అవుట్ల లెవెలింగ్ పేరుతో పాత లబ్ధిదారుల నుండి ఓటిఎస్ పేరుతో రూ.150 కోట్లు దుర్వినియోగం చేశారన్నారు. ఇటువంటి అంశాలలో ఐఏఎస్, ఐఎఫ్ఎస్‌సి అధికారుల పాత్ర ఉందని, వారిపై సెంట్రల్ విజిలెన్స్ సంస్థచే దర్యాప్తు జలపించాలని ఎండికి ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు విజయశ్రీ, రత్న నాయుడు, ఆదినారాయణ సృజన, లక్ష్మణరావు, ముని సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# రమేష్ రెడ్డి నగర్ ఖాళీ స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేయాలి : బీజేపీ

- ఫతేఖాన్‌పేటలో పార్కు అభివృద్ధికి బీజేపీ వినతి
- అన్యాక్రాంతం కాకముందే ఖాళీ స్థలాన్ని పార్కుగా మార్చాలి
- రమేష్ రెడ్డి నగర్‌లో పార్కు ఏర్పాటు చేయాలని ?

రూరల్ ఎమ్మెల్యే, కమిషనర్‌లకు వినతి



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** ఫతేఖాన్‌పేటలోని రమేష్‌రెడ్డి నగర్‌లో ఖాళీగా ఉన్న పార్కు స్థలాన్ని వెంటనే అభివృద్ధి చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యాకసిరి ఫణిరాజు డిమాండ్ చేశారు. స్థానికులతో కలిసి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి, అలాగే నెల్లూరు నగర్ కమిషనర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాకసిరి ఫణిరాజు మాట్లాడుతూ.. 'రమేష్ రెడ్డి నగర్ పరిధిలో రవీంద్ర భారతి స్కూల్ ఎదురుగా ఉన్న ఎల్‌పీ నంబర్ 433/86, సర్వే నంబర్లు 473, 474-2, 475/పి, 1459-2 పరిధిలో మొత్తం 6.55 ఎకరాల విస్తీర్ణంలో 91 సెంట్లను పార్కు కోసం కేటాయించారు. అయితే ప్రస్తుతం ఆ స్థలం ఖాళీగా ఉండడంతో అన్యాక్రాంతానికి గురయ్యే ప్రమాదం ఉంది. అందువల్ల ఆ స్థలాన్ని వెంటనే పార్కుగా అభివృద్ధి చేసి, చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి, పిల్లలకు ఆట వస్తువులు, పెద్దలకు వాకింగ్ ట్రాక్, లైటింగ్ సౌకర్యం, చెట్లు, శుభ్రత వంటి ఏర్పాట్లు చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి. ఇది స్థానిక ప్రజలకు ఎంతో అవసరమైన ప్రజాప్రయోజన అంశం. కాబట్టి సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలి' అని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు వంశీధర్ రెడ్డి, నీలగిరి సంఘం మండల అధ్యక్షులు మల్లిరవి, బీజేపీ నాయకులు చిలక ప్రవీణ్ కుమార్, చిలక ప్రదీప్, తిరువీధి నారాయణ, స్థానికులు సుమన్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# కల్తీ పేరుతో హిందువుల మనోభావాలు దెబ్బతీస్తున్నారు..

## మీకిది న్యాయమా.. ఆనం విజయకుమార్ రెడ్డి




**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** వైసీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి నెల్లూరు రూరల్ నియోజకవర్గం చింతరెడ్డిపాలెంలోని వైసీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ కార్యాలయం నందు జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తిరుపతి తిరుమల దేవస్థానానికి సంబంధించినటువంటి లడ్డు విషయంలో అవినీతి కల్తి జరిగిందని వివిధ రకాలైనటువంటి అభిప్రాయాలతో ప్రజల విశ్వాసంతో పూర్తిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెలగాటమాడినటువంటి పరిస్థితులు మొన్న చూశాం వారికి తోడుగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, అదే రకంగా మంత్రి నారా లోకేష్ వాస్తవ పరిస్థితులను పరిగణలోకి తీసుకోకుండా ఎవరికి ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం సమంజసం కాదని తెలియజేశారు. అదేవిధంగా ఎన్‌డిడిబి, ఎన్‌డిఆర్ఐ వారు లడ్డులో వాడిన నెయ్యిలో ఎటువంటి జంతు మాంసం గాని చాప నూనె గాని జంతువుల మూలం కానీ లేదు అని రిపోర్ట్ ఇవ్వడం జరిగింది. ఆ రిపోర్ట్‌ని జతచేస్తూ సీబీఐ వారు సుప్రీంకోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయడం జరిగింది. అలాగే చంద్రబాబు నాయుడు ఎప్పుడు ఏది నిజం చెప్పడు పదవి తప్ప అతనికి ఏది ముఖ్యం కాదు ఆయనకి దేవుడు లేడు భక్తి లేదు. అదేవిధంగా భగవంతుడి ఆశీర్వాదం కోసం కొండని కోట్ల మంది ఎక్కి నడిచి పోయే వాళ్ల మనోభావాల్ని దెబ్బ తీసే విధంగా మీ రాజకీయాల అవసరం కోసం దేవుడి ప్రసాదాలు కూడా మీరు వదిలి పెట్ట లేదంటే హీనమైన సంస్కృతి ఏ పార్టీలో ఉండవు. ఈ కూటమి నేతల దగ్గర తప్పు అని మనవి చేస్తూ. ఇటువంటి దుర్మార్గపు ఆలోచనలు వైసీపీ తీవ్రంగా ఖండిస్తుంది పేర్కొన్నారు. అదేవిధంగా హిందువుల మానసిక వ్యవస్థపై దెబ్బ కొట్టడానికి ప్రయత్నించిన మీరు తప్పనిసరిగా కూటమి నేతలు అందరూ కూడా ప్రజలకు క్షమాపణ చెప్పాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ మండల అధ్యక్షుడు పుచ్చలపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి,కలివెలపాళెం సర్పంచ్ పార్లపల్లి మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు చెన్నారెడ్డి ప్రభాకర్ రెడ్డి, కలివెలపాళెం పీఏసీఎస్ మాజీ చైర్మన్ పార్లపల్లి వీరరాఘవరెడ్డి, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎస్సీ విభాగ అధ్యక్షుడు తోగూరు జాషువా, 12వ డివిజన్ ఇంచార్జ్ ప్రసాద్, 12వ డివిజన్ నాయకులు శ్రీనివాసులు రెడ్డి, బాలాజీ, మదన్ మోహన్, కిషోర్, రాజా తదితరులు పాల్గొన్నారు.

## ఆలయనిర్మాణానికి స్థలపరిశీలన



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం నువ్వురుపాడు పంచాయతీ పరిధిలోని అంబేద్కర్ కాలనీలో శ్రీకోదండరామస్వామి ఆలయ నిర్మాణానికి మంగళవారం అధికారులు, నాయకులు, కాలనీవాసులు స్థలపరిశీలన గావించారు. ఈకాలనీలో రామాలయం కావాలని కోరగా రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సంసిద్ధత తెలిపి ప్రతిపాదనలు పంపారు. మంత్రి ఆదేశాల మేరకు అధికారులు, కమిటీ సభ్యులు నిర్మాణానికి అనువైన స్థలం ఎంపికకోసం పరిశీలన గావించారు. ఆలయ ఏర్పాటుకు సహకారమందించిన మండల టిడిపి అధ్యక్షుడు సుంకరపెంచలచౌదరి, నియోజకవర్గ సీనియర్ టిడిపి నాయకుడు కేతా విజయ భాస్కర్‌రెడ్డికి, మండల టిడిపి యూనిట్ ఇన్‌చార్జ్ కొండ్రెడ్డి రమణారెడ్డికి కాలనీ వాసులు, ఆలయనిర్మాణ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కార్పొరేషన్ అధికారులతో ఇన్‌చార్జ్ మేయర్ సమీక్ష



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ మేయర్ రూప్ కుమార్ యాదవ్ రెవెన్యూ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగం, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, నీటిపారుదల శాఖ అధికారులతో కార్యాలయంలోని మేయర్ ఛాంబర్‌లో మంగళవారం సమీక్ష నిర్వహించారు. కార్పొరేషన్ పరిధిలోని వివిధ నీటిపారుదల కాలువలపై జరుగుతున్న నిర్మాణ పనులలో జరుగుతున్న పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ తహశీల్దార్ షఫీ మాలిక్, నగరపాలక సంస్థ యస్.ఈ.రహంతు జానీ, ఇరిగేషన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అనిల్ కుమార్ రెడ్డి, సిటీ ప్లానర్ రఘునాధ రావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వీఎస్‌యూలో 'యోగ సేతు-2026' పోస్టర్ ఆవిష్కరణ

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** యువత, విద్యార్థుల్లో ఆరోగ్యం-మానసిక ప్రశాంతతపై అవగాహన కల్పించే లక్ష్యంతో నిర్వహించనున్న 'యోగ సేతు-2026' జాతీయస్థాయి యోగా సదస్సు పోస్టర్‌ను విక్రమసింహపురి విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. కె.సునీత ఆవిష్కరించారు. ఫిబ్రవరి 13న నెల్లూరులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో ఒకరోజు సదస్సు జరగనుంది. ఈ కార్యక్రమాన్ని ఇండియన్ యోగా అసోసియేషన్, ఏపీ శాఖ, జేఎన్‌టీయూఏ, విక్రమసింహపురి విశ్వవిద్యాలయాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని డా. సునీత కోరారు. ఈ సదస్సుకు వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, జేఎన్‌టీయూ అనంతపురం ప్రొఫెసర్ హెచ్.సుదర్శన రావు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు.

# అవినీతి, అక్రమాలు, అసత్య ఆరోపణలు వైసీపీ నేతల నైజం

- రాయలసీమద్రోహి జగన్
- ప్రాజెక్టులపై కుట్రలు
- తిరుమలలడ్డు కల్తీపై దోబూచులు
- ధ్వజమెత్తిన జనసేన నేత శ్రీధర్

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** అవినీతి, అక్రమాలు, దుర్మార్గాలు, బూతులు, అస్యత్యారోపణలు వైసిపి నేతల నైజమని, సాగునీటి ప్రాజెక్టుపై వైసిపి నేతలు కుట్రలు పన్నుతున్నారని, రాయసీమద్రోహి జగన్మోహన్‌రెడ్డి అని ఆత్మకూరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ నలిశెట్టి శ్రీధర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తిరుమల లడ్డు కల్తీ విషయం, రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుపై వైసిపి నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలకు వ్యతిరేకంగా మంగళవారం ఆత్మకూరులో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ నలిశెట్టి శ్రీధర్ ఆధ్వర్యంలో నిరసనర్యాలీ, ధర్నా నిర్వహించారు. స్తానిక మున్సిపల్ బస్టాండువద్ద డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం అక్కడనుండి ఆర్డీవో కార్యాలయం వరకు నినాదాలు చేసుకుంటూ ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయంవద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో భూమిరెడ్డి పావనికి వారు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నలిశెట్టి శ్రీధర్ విలేకరులతో మాట్లాడుతూ.. వైసిపి నేతలకు వికృతమానసిక ప్రవర్తన ఉందని విమర్శించారు. తిరుమలలడ్డు నకిలీదని, రసాయనాలతో తయారు చేసిందని అనేక రిపోర్టులు తేటతెల్లంచేసినా అసలు కల్తీయేలేదంటూ, వేలకోట్ల రూపాయల అవినీతి జరిగినా లేదులేదంటూ బుకాయిస్తూ అసత్య ప్రచారాలకు పూనుకున్నారని ఆయన తీవ్రంగా ధ్వజమెత్తారు. తాము శుద్ధపూసలమంటూ అడ్డదిడ్డంగా వాదిస్తున్నారని, బాబాయి హత్యను మసిపూసి మారేడు కాయచేయబూని నారాసురరక్తచరిత్ర అంటూ ప్రచారం చేశారని, తమ కూటమి నేతలపై బూతులు ప్రయోగిస్తున్నారని, కూటమి ప్రభుత్వంలో రాయసీమరైతాంగానికి తీవ్ర అన్యాయం జరిగిందంటూ అసత్యాలను వండివారుస్తున్నారని శ్రీధర్ విరుచుకుపడ్డారు. కూటమి ప్రభుత్వ భాగస్వామ్యపార్టీగా జనసేన తరపున వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత తమపై ఉందని ఆయన పేర్కొన్నారు. 2014లో రాష్ట్ర విభజన జరిగిందని, కృష్ణా,గోదావరి నీటిపంపాకాల విషయంలో రెండు రాష్ట్రాలకు ఎంతవాటాయో స్పష్టంగా నిర్ణయిస్తూ పార్లమెంటులో చట్టం చేశారన్నారు. రెండు జిల్లాలకు సంబంధించి వాటర్‌బోర్డులను ఏర్పాటు చేశారన్నారు. 2014తరువాత ఈరెండు నదులకు సంబంధించి కొత్త నీటి ప్రాజెక్టులను నిర్మించదలుచుకుంటే ఖచ్చితంగా వాటర్‌బోర్డుల అనుమతులు తీసుకోవాల్సి ఉందని శ్రీధర్ వివరించారు. కానీ చట్టవిరుద్ధంగా వైసిపి ప్రభుత్వం 2020-21లో రాయసీమసంఘమేశ్వరప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారన్నారు. 6వేలకోట్ల డిపిఆర్‌తో 3వేలకోట్లు మంజూరు చేయించుకొని పనులు ప్రారంభించారన్నారు. అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఆ పనులను అప్పగించారని శ్రీధర్ పేర్కొన్నారు. సుమారు వెయ్యికోట్ల రూపాయల పనులు జరిగిన తరువాత తెలంగాణాప్రభుత్వ అభ్యంతరంతో నేషనల్‌గ్రీన్ ట్రిబ్యునల్ ఈప్రాజెక్టు నిర్మించకుండా స్టే విధించిందని ఆయన తెలిపారు. అనంతరం 3సంవత్సరాల కాలంలో వైసిపి అధికారంలో ఉండగా తెలంగాణా పెద్దలతో మాట్లాడి స్టే ఎత్తివేయించే ప్రయత్నం చేయలేదని, వైసిపి ప్రభుత్వ వైఫల్యం కాదా, వెయ్యికోట్ల దుర్వినియోగం కాదా అని ఆయన వైసిపినేతలను ప్రశ్నించారు. ఇప్పుడు కూటమిప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేయడం సిగ్గుగా అన్పించడం లేదా అని ఆయన ప్రశ్నించారు. 2019-24కాలంలో రాయలసీమ సాగునీటి ప్రాజెక్టును సర్వనాశనం చేసిన వైసిపి వారు నేడు సాగునీటి ప్రాజెక్టుగురించి మాట్లాడే అర్హత ఉందా అని ఆయన ప్రశ్నించారు. మీ ప్రభుత్వ హయాంలో పులచింతల ప్రాజెక్టు



కొట్టుకునిపోవడం నిజంకాదా, అన్నమయ్యడ్యామ్ పూర్తిగా కొట్టుకొని పోలేదా, ఫించాడ్యామ్ కొట్టుకుపోలేదా, నెల్లూరు జిల్లా వరప్రసాదిని సోమశిల ప్రాజెక్టు ఆఫ్రాన్ వరదలకు కొట్టుకొని పోవడం వాస్తవం కాదా, మీరు చలించారా, పునరుద్ధరించారా అని శ్రీధర్ ప్రశ్నించారు. ప్రాజెక్టును కాపాడుకోలేని వైసిపిది అసమర్థపాలన కాదా అని శ్రీధర్ ప్రశ్నించారు. రాయలసీమ రైతాంగానికి చేసిన ద్రోహానికి సిగ్గుతో తలదించుకోవాల్సిందిపోయి కూటమి ప్రభుత్వంపై ఎదురుదాడికి దిగడం మీకుతెలిసిన విద్యా అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం గోదావరి, కృష్ణా నదుల అనుసంధాన కార్యక్రమానికి మీఅనుంగుసోదరుడు కెసిఆర్తఓ కలిసి రాయలసీమ రైతాంగప్రయోజనాలు దెబ్బతీసే కార్యక్రమాలు మానుకోవాలని శ్రీధర్ హితవు పలికారు. ఈకార్యక్రమంలో నలిశెట్టి శ్రీధర్‌తోపాటు నెల్లూరు నగర జనసేన అధ్యక్షుడు సుజయ్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్, కృష్ణ, పెన్నా రీజనల్ కోఆర్డినేటర్ కోలా విజయలక్ష్మి, నాగరత్నం యాదవ్, షేక్ అలియా, ఆత్మకూరుకు చెందిన జనసేన నాయకులు, వీరమహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.